# మీ వేదాంతశాస్త్రమును కట్టుట

మూడవ పాఠము

## ప్రత్యక్షత మీద ఆధారపడుట

THIRD MILLENNIUM MINISTRIES

బైబిల్ విద్య. లోకము కొరకు. ఉచితముగా.

వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

© 2012 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన, థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి., 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుంచి వ్రాతమూలకమైన అనుమతి పొందకుండా పునఃసమీలలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహాయిస్తే, పునఃర్ముద్రింపబడకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపింపబడిన థర్డ్ మిలీనియం పరిచర్యలు ఒక లాభాపేక్షలేని క్రైస్తవ వ్యవస్థగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను సమకూర్చు నిమిత్తము ప్రతిష్టింపబడింది. వర్తమాన కాలములో హితమైన, లేఖనానుసారమైన క్రైస్తవ నాయకత్వ శిక్షణ కొరకు ఇతోధికంగా అధికమవుతున్న విశ్వవ్యాప్త అవసరతకు ప్రతిస్పందనగా, మేము తేలికగా ఉపయోగించడానికి వీలైన, దాతల పోషణతో, బహుముఖ ప్రసార మాధ్యమముల ద్వారా ప్రయోగింపబడగల వేదపాఠ అధ్యయన శాల పాఠ్య క్రమమును ఐదు ప్రధాన భాషలలో (ఇంగ్లీష్, స్పానిష్, రష్యన్, మాండరిన్ చైనీస్, మరియు అరబిక్) సిద్ధం చేస్తున్నాము మరియు ఇది అత్యావశ్యకమైయున్న వారికి, ప్రాథమికంగా సంప్రదాయిక విద్యనభ్యసించడానికి అందుబాటులేని, లేదా ఆర్థికంగా భరించలేని క్రైస్తవ నాయకులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాము. పాఠములన్నియు రచింపబడినవి, రూపొందింపబడినవి, మరియు సంస్థలోపలే సిద్ధంచేయబడుతున్నవి, మరియు శైలి మరియు నాణ్యతలో హిస్టరీ ఛానల్©లో ప్రసారమగువాటి వలెనున్నవి. క్రైస్తవ నాయకులకు శిక్షణ నిచ్చుటకు ఈ అసమానమైన, ఖర్చుకు తగిన ఫలితమునిచ్చు పద్ధతి చాలా కార్యసార్థకమైనదై యున్నదని ప్రపంచమందంతటను రుజువయ్యింది. విద్య మరియు సజీవ వ్యంగ్య చిత్రముల ఉపయోగములో ప్రయోజనపడు విశిష్టమైన వీడియో చిత్రముల ఉత్పత్తి విషయంలో మేము టెల్లి అవార్డ్స్ గెలుచుకున్నాము, మరియు మా పాఠ్య క్రమము ప్రస్తుతము 192 కంటె ఎక్కువ దేశాలలో ప్రయోగింపబడుతుంది. థర్డ్ మిలీనియం పరిచర్యల యొక్క సాహిత్యం మొదలగు వస్తువులైన డీవీడీ, ముద్రణ, ఇంటర్నెట్, ఉపగ్రహ దూరదర్శిని ప్రసారములు, మరియు రేడియో మరియు దూరదర్శిని ప్రసారముల రూపంలో వాడబడుతున్నవి.

ఈ పరిచర్యలను గూర్చి మరియు మీరు మాతో కలసి ఎలా పరిచర్య చేయవచ్చునో తెలిసికొనగోరుచున్నట్లయితే, అదనపు సమాచారం కొరకు http://thirdmill.org ను సందర్శించండి.

# విషయ సూచిక

ఉపోద్ఘాతము....1
ప్రత్యక్షతను కనుగొనుట....2
సాధారణ ప్రత్యక్షత....2
మాధ్యమము....3
ముఖ్య విషయములు....4
విశేష ప్రత్యక్షత....5
అనుబంధములు....7
అతివ్యాప్తి....7
అవసరత....10
ప్రత్యక్షతను అర్థము చేసుకొనుట....12
పాపము యొక్క ఆటంకం....12
సాధారణ ప్రత్యక్షత....13
విశేష ప్రత్యక్షత....14
పరిశుద్ధాత్మ వెలిగింపు....15
విశేష ప్రత్యక్షత....15
సాధారణ ప్రత్యక్షత....17
ఫలితములు....18
నిశ్చయతను అభివృద్ధి చేయుట....21
సమధర్మ గుణము....21
వినయముతో సమర్పించుకొను ప్రక్రియ....24
తగిన అమరిక....27
ముగింపు....29

# మీ వేదాంతశాస్త్రమును కట్టుట

మూడవ పాఠము

ప్రత్యక్షత మీద ఆధారపడుట

## ఉపోద్ఘాతము

మీరు ఎవరికైనా ఒక బహుమానము ఇచ్చిన తరువాత వారు దానిని ఎన్నడు ఉపయోగించలేదని తెలుసుకొనిన సందర్భాలు ఉన్నాయా? నేను అనేక పనుల మధ్య నిమగ్నమైయున్నప్పుడు నా స్నేహితుడు ఒకడు నాకొక చిత్ర పటమును ఇచ్చాడు. ఆ సమయములో దానిని ఎక్కడ పెట్టాలో అర్థం కాక, దానిని తరువాత చూద్దామని ఒక అలమరలో పెట్టేశాను. అయితే, మీకు తెలిసినట్టుగానే, దానిని గూర్చి నేను మరచిపోయాను మరియు ఆ స్నేహితుడు ఒక సంవత్సరం తరువాత మా ఇంటిని దర్శించుటకు వచ్చాడు. అతడు మా ఇంట్లో చుట్టూ చూసి ఇలా అన్నాడు, "పోయిన సంవత్సరం నేను నీకిచ్చిన చిత్ర పటము నీకు నచ్చిందా?" నా ముఖము ఒక్కసారిగా ఎర్రబారి, "ఏ చిత్ర పటము?" అని అడిగాను. అప్పుడు అతడు నా వైపు చూసి అన్నాడు కదా, "సరే, నీ ఈ జవాబే నా ప్రశ్నకు సమాధానం చెబుతుంది. ఒకవేళ అది నీకు నచ్చియుంటే, నీవు దానిని ఉపయోగించేవాడివే."

అయితే, ఇలాంటిదే క్రైస్తవ వేదాంతశాస్త్రములో కూడా జరుగుతుంది. క్రీస్తు యొక్క అనుచరులుగా, మనందరికీ దేవుడు ఆయన స్వయం-ప్రత్యక్షత అనే బహుమానమును ఇచ్చాడని మనము నమ్ముతాము, మరియు దానిని ఎంతగా ఉపయోగిస్తామో అంతగా దానిని మెచ్చుకుంటున్నట్టు చూపిస్తాము.

*మీ వేదాంతశాస్త్రమును కట్టుట* అనే పాఠ్యక్రమములో ఇది మూడవ పాఠం, మరియు దీనికి "ప్రత్యక్షత మీద ఆధారపడుట" అనే శీర్షికను ఇచ్చాము. మరియు మన వేదాంతశాస్త్రమును నిర్మించుచుండగా దేవుని ప్రత్యక్షతను ఎలా ఉపయోగించాలో మనము నేర్చుకుందాము.

ఈ పాఠం మూడు ముఖ్యమైన భాగములుగా విభజింపబడుతుంది: మొదటిగా, లేఖనములు ప్రత్యక్షతను గూర్చి ఏమి బోధించుచున్నాయో మరియు దానిని మనము ఎక్కడ చూడవొచ్చో నేర్చుకుందాము; రెండవదిగా, దేవుని ప్రత్యక్షతను అర్థము చేసుకొనుటకు ఉపయోగపడు ముఖ్యమైన క్రియాశీలకములను పరీక్షించుదాము; మరియు మూడవదిగా, దేవుని ప్రత్యక్షతలో నుండి మనము పొందుకొను వేదాంతశాస్త్ర జవాబుల మీద నిశ్చయతను ఎలా అభివృద్ధి చేయాలో చూద్దాము. దేవుని ప్రత్యక్షత ఎక్కడ కనబడుతుంది అను విషయముతో ఆరంభించుదాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## ప్రత్యక్షతను కనుగొనుట

కొన్ని అరుదైన సందర్భాలు మినహా, గత రెండు శతాబ్దములలో, క్రైస్తవ వేదాంతశాస్త్రములో దైవిక ప్రత్యక్షత అనేది ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది అని క్రైస్తవ వేదాంతశాస్త్రవేత్తలు ఒక విధముగానో లేక మరొక విధముగానో సమ్మతించారు. దేవుడు తనను తాను మరియు తన చిత్తమును మనకు బయలుపరచాడు అనే నమ్మకము లేఖనముల యొక్క ఆరంభ పేజీల నుండి మనకు కనిపిస్తుంది. పాత నిబంధన యొక్క నమ్మకమైన సాక్ష్యము ద్వారా, యేసు ద్వారా మరియు క్రొత్త నిబంధన రచయితల ద్వారా అది మన యొద్దకు వస్తుంది. అయితే దేవుడు మనకు ఈ విలువైన బహుమానమును ఇచ్చాడని మాటలలో మాత్రమే తెలుసుకొనుట సరిపోదు. అది ఎక్కడ కనబడుతుందో కూడా మనము ఎరిగియుండాలి.

ఈ అంశమును గూర్చి నేర్చుకొనుచుండగా, మనము మూడు విషయములను చూద్దాము: మొదట, సాధారణ ప్రత్యక్షత అనే సిద్ధాంతమును మనము చూద్దాము; రెండవదిగా, విశేష ప్రత్యక్షత అనే సిద్ధాంతమును మనము చూద్దాము; మరియు మూడవదిగా, ఈ రెండు ప్రత్యక్షతల మధ్య ఉన్న అనుబంధాలను పరీక్షించుదాము.

### సాధారణ ప్రత్యక్షత

దేవుడు మానవ జాతికి తనను తాను ప్రత్యక్షపరచుకొన్న ప్రాముఖ్యమైన మార్గములలో ఒక మార్గము మనము తరచుగా పిలచుకొను "సాధారణ ప్రత్యక్షత." మనము "సాధారణ" అనే పదమును దేవుడు తనను తాను సాధారణముగా సృష్టించబడిన జీవులన్నిటికి మరియు సాధారణంగా ప్రజలందరికీ ప్రత్యక్షపరచుకొనెను అనే విషయమును తెలియజేయుటకు ఉపయోగిస్తాము. దీనిని కొన్ని సార్లు "ప్రాకృతిక ప్రత్యక్షత" అని కూడా పిలుస్తాము, ఎందుకంటే ఈ ప్రత్యక్షత ప్రకృతి లేక సృష్టి అను మాధ్యమము ద్వారా కలిగినది.

సాధారణ ప్రత్యక్షతను గూర్చి అనేక లేఖన భాగములు బోధించుచున్నాయి. ఉదాహరణకు, ఈ అంశమును మనము కీర్తనలు 19:1-6, అపో. 14:15-17 మరియు అపో. 17:26-27లలో చూడవచ్చు. అయితే బైబిలులోని సాధారణ ప్రత్యక్షత యొక్క సంపూర్ణ వివరణ మనకు సుపరిచితమైన వచనములైన రోమా. 1:18-32లో కనిపిస్తుంది.

ఈ బైబిలు బోధనను పరీక్షించుటకు మనము రెండు విషయములను చూడవలసియున్నది: మొదటిగా, సాధారణ ప్రత్యక్షత యొక్క మాధ్యమము; మరియు రెండవది, సాధారణ ప్రత్యక్షతలోని ముఖ్య విషయములు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## మాధ్యమము

మొదటిగా, సాధారణ ప్రత్యక్షత యొక్క మాధ్యమము, పరికరము, లేక మార్గము సృష్టి అని లేఖనములు బోధించుచున్నవి. రోమా. 1:18-20లో పౌలు ఈ విషయమును గూర్చి మాట్లాడుతున్న విధమును చూడండి:

> . . . దేవుని కోపము పరలోకమునుండి బయలుపరచబడుచున్నది. . . . దేవుడు అది వారికి విశదపరచెను . . . సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటపడుచున్నవి . . . (రోమా. 1:18-20).

దేవుడు మనకు తనను తాను సృష్టి ద్వారా, లేక ఇక్కడ చెప్పబడినట్టు, "సృష్టింపబడినవాటి" ద్వారా బయలుపరచుకొంటాడని ఈ మాటలు మనకు తెలియజేయుచున్నాయి.

ప్రత్యక్షత అనేది బయట ఆకాశములోని పెద్ద నక్షత్రవీధుల ద్వారా మరియు భూత అద్దము ద్వారా వీక్షింపబడు సూక్ష్మ-లోకము ద్వారా మనకు బయలుపరచబడుతుంది; సృష్టి యొక్క భౌతిక, అభౌతిక మరియు ఆత్మీయ కోణముల ద్వారా, మానవులుగా మన సొంత ఉనికి ద్వారా కూడా — సమస్తము దేవుని ప్రత్యక్షతకు మాధ్యమాలుగా ఉన్నాయి. దురదృష్టవశాత్తు, చాలా సార్లు రోమా 1లోని ఈ మాటలు కేవలం ప్రాకృతిక స్థితిలో ఉన్న సృష్టిని మాత్రమే సంబోధించుచున్నాయని క్రైస్తవులు అనుకొంటుంటారు. అడవులు, సరస్సులు, పర్వతములు, మరియు అరణ్యములు మన ఆలోచనలను దేవుని వైపు ఎలా మళ్లిస్తాయో మనందరికీ తెలుసు. కాని నాగరికత, ఆధునికత, మరియు మానవ సంస్కృతి కూడా దేవుని బయలుపరుస్తుంది అని గ్రహించుటలో చాలా సార్లు మనము విఫలమవుతాము.

రోమా 1లో పౌలు కేవలము ప్రాకృతిక స్థితిలో ఉన్న సృష్టిని గూర్చి మాత్రమే మాట్లాడుట లేదని మనము గ్రహించుట చాలా ప్రాముఖ్యమైన విషయము; మానవుల యొక్క ప్రభావము క్రింద సృష్టి ఉండుట ప్రత్యక్షతకు ఒక మార్గమని కూడా అతడు సంబోధించాడు. లోకములోని పాపాత్మకమైన మానవ సంస్కృతి తీసుకొనివచ్చు భ్రష్టత్వములను గూర్చి మాట్లాడుతూ, ప్రజలు మానవులు చేయు ఈ భ్రష్టత్వములను చూసి దేవుని చిత్తమును గూర్చి కొన్ని విషయములు నేర్చుకుంటారని కూడా పౌలు తెలియజేస్తున్నాడు. రోమా. 1:32లో పౌలు ఈ మాటలు వ్రాసాడు:

> ఇట్టి కార్యములను అభ్యసించువారు మరణమునకు తగినవారు అను దేవుని న్యాయవిధిని వారు బాగుగ ఎరిగియుండియు, వాటిని చేయుచున్నారు. ఇది మాత్రమే గాక వాటిని అభ్యసించు వారితో సంతోషముగా సమ్మతించుచున్నారు (రోమా. 1: 32).

సాధారణ ప్రత్యక్షత అనేది సృష్టిలో మానవులు చేయు పనులు ద్వారా కలుగుతుందిగాని, కేవలం సృష్టి యొక్క ప్రాకృతిక స్థితిలో కలుగదని ఈ మాటలు సూచించుచున్నాయి. మానవ పరిజ్ఞానములు, విజ్ఞానము, వాస్తుశాస్త్రము, రాజకీయము, కుటుంబ జీవితము, కళ, ఔషధము, సంగీతము, మరియు మానవ సంస్కృతి యొక్క అనేక ఇతర ఉత్పత్తులు కూడా దేవుని ప్రత్యక్షతను ధ్యానిస్తాయి. మనము దేవుని ప్రత్యక్షతను తప్పించుకోలేము; అది ఎల్లప్పుడూ మనలను చుట్టుముట్టి యుంటుంది.

## ముఖ్య విషయములు

రెండవ స్థానంలో, రోమా 1వ అధ్యాయములో పౌలు సాధారణ ప్రత్యక్షత యొక్క ముఖ్య విషయములనుకూడా సూచించాడని మనము గుర్తించాలి.

ఇప్పుడు, ఈ దృష్టికోణం ప్రకారం, సాధారణ ప్రత్యక్షత ద్వారా ప్రజలు ఏమి తెలుసుకున్నారు అనే విషయమును గూర్చి పౌలు స్పష్టముగా మాట్లాడుటలేదు. ఈ నిర్దిష్టత లేమి అనేది పలు స్థలములు మరియు కాలములలోని పలు రకముల ప్రజలు సాధారణ ప్రత్యక్షత యొక్క పలు రకముల అంశములను ఎదుర్కొంటారు మరియు గుర్తిస్తారు అనే సత్యము మీద ఆధారపడియుండవచ్చు. ఏదిఏమైన, సాధారణ ప్రత్యక్షత మానవులకు కనీసం రెండు రకముల సమాచారమును బయలుపరుస్తుంది అని పౌలు స్పష్టము చేశాడు: దేవుని గుణలక్షణములు, మరియు దానికి తగిన మన నైతిక బాధ్యతలు.

ఒక వైపు, రోమా. 1:20లో పౌలు చెబుతున్నట్టు, సృష్టి వీటిని బయలుపరుస్తుంది:

> ఆయన అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును (రోమా. 1:20).

మరొక మాటలో, ప్రత్యక్షంగా కనబడని దేవుని గుణలక్షణములను పరోక్షంగా సృష్టిలో చూడవచ్చు. ఈ భూమి మీద ఉన్న ప్రతి వ్యక్తి దేవుని గుణలక్షణములను గూర్చిన కొన్ని కోణములు తెలిసినవాడిగా ఉన్నాడు, ఎందుకంటే పౌలు రోమా. 1:19లో చెబుతున్నట్టు, సాధారణ ప్రత్యక్షతలో "దేవుడు అది వారికి విశదపరచెను."

ఉదాహరణకు, సృష్టి యొక్క అందము దేవుని యొక్క దిగ్భ్రమపరచే సౌందర్యమును కనుపరుస్తుంది; మానవ జీవితము కొరకు సృష్టిలోని ఏర్పాట్లు ఆయన మంచితనమును కనుపరుస్తాయి; సృష్టి యొక్క పరిమాణము మాత్రమే ఆయన గొప్పతనమును బయలుపరుస్తుంది; సృష్టి యొక్క క్లిష్టత ఆయన జ్ఞానమును చూపిస్తుంది; మరియు ప్రకృతి యొక్క శక్తి ఆయన దైవిక శక్తిని బయలుపరుస్తుంది.

మరొక వైపు, దేవుని యొక్క అదృశ్యమైన గుణములను బయలుపరచుటతో పాటు, సాధారణ ప్రత్యక్షత దేవుని ఎదుట మన నైతిక బాధ్యతలను కూడా బయలుపరుస్తుంది. మానవ జాతి యొక్క పాపపు స్వభావమును గూర్చి మాట్లాడుతూ ఈ విషయమును గూర్చి రోమా. 1:32లో పౌలు చెప్పిన మాటలను వినండి:

> ఇట్టి కార్యములను అభ్యసించువారు మరణమునకు తగినవారు అను దేవుని న్యాయవిధిని వారు బాగుగ ఎరిగియుండియు, వాటిని చేయుచున్నారు. ఇది మాత్రమే గాక వాటిని అభ్యసించు వారితో సంతోషముగా సమ్మతించుచున్నారు (రోమా. 1:32).

మరొక మాటలో, సృష్టిలోని అనేక విషయములు దేవుని ఎదుట మన నైతిక బాధ్యతలను బయలుపరుస్తాయి.

ఉదాహరణకు, స్త్రీ పురుషుల మధ్య ఉన్న జీవశాస్త్ర భిన్నత్వములు మనము భిన్న లింగసంపర్కతను ఆచరించాలని బయలుపరుస్తాయి. పిల్లలు తల్లిదండ్రుల సంరక్షణ మీద ఆధారపడుట పిల్లలను సంరక్షించుట పట్ల తల్లిదండ్రులు కలిగియుండిన బాధ్యతను, మరియు పిల్లలు కలిగియున్న తల్లిదండ్రులను సన్మానించవలసిన బాధ్యతను బయలుపరుస్తాయి. కరువు మరియు యుద్ధములో మానవుల యొక్క శ్రమలు కరుణను చూపుట పట్ల మనము కలిగియున్న బాధ్యతను బయలుపరుస్తాయి. మనము ఎటు చూసినా, సృష్టి మనలను పిలుస్తుంది, మరియు సృష్టి ద్వారా మరియు సృష్టిలో దేవుడు కనుపరచు నైతిక విలువలకు మన జీవితమును అనుగుణంగా మలచుకోవాలని కోరుతుంది.

సాధారణ ప్రత్యక్షత అనే అంశమును మనము చూశాము కాబట్టి, ఇప్పుడు ప్రత్యక్షత యొక్క రెండవ రూపమైన, విశేష ప్రత్యక్షతను మనము చూద్దాము.

## విశేష ప్రత్యక్షత

ప్రత్యక్షత యొక్క ఈ విధమును “విశేష” అని ఎందుకంటారంటే, ఇది అన్ని స్థలములలో అందరి ప్రజలకు ఇవ్వబడలేదు, కాని మానవ జాతిలో కొందరికి లేక విశేషమైన వారికి మాత్రమే ఇవ్వబడింది.

చరిత్రలో విశేష ప్రత్యక్షత పలు విధములను అనుసరించింది, కాని క్రైస్తవ ఆలోచన దృష్టిలో దేవుడు తనను తాను స్పష్టముగాను సంపూర్ణంగాను ఆయన కుమారుడైన యేసు ద్వారా బయలుపరచుకున్నాడు.

విశేష ప్రత్యక్షతను గూర్చి క్రైస్తవ ఆలోచనను హెబ్రీ. 1:1-3 చాలా ఖచ్చితముగా క్రోడీకరిస్తుంది:

> పూర్వకాలమందు నానాసమయములలోను నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకును వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను. ఆయన దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వము యొక్క మూర్తిమంతమునైయుండి . . . (హెబ్రీ. 1:1-3).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

క్రీస్తు రాకకు మునుపు, దేవుడు తనను తాను మరియు ఆయన చిత్తమును అనేక విశేష మార్గములలో బయలుపరచుకున్నాడు. ఆయన ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడాడు, వారికి అసమాన్యమైన కలలను ఇచ్చాడు, దర్శనములు చూచుటకు వారి కన్నులను తెరచాడు మరియు ఆయన ప్రవక్తలు, యాజకులు, రాజులు మరియు పరిశుద్ధుల ద్వారా మాట్లాడాడు. అయితే వీటిలో ఏ ప్రత్యక్షత కూడా దేవుని కుమారుడైన క్రీస్తు యొక్క అత్యంత మహిమకరమైన ప్రత్యక్షతకు పోలినవైనవికావు. యేసు యొక్క జీవితము మరియు బోధనలు దేవుని యొక్క అత్యంత విశేషమైన ప్రత్యక్షతలై ఉన్నాయి. మరియు ఈ కారణము చేత, క్రీస్తులో దేవుని ప్రత్యక్షత క్రైస్తవ వేదాంతశాస్త్రమునకు ఒక ప్రమాణముగా ఉన్నదని చెప్పుట మంచిది. ఇప్పుడు, దేవుని యొక్క అత్యున్నత ప్రత్యక్షతగా క్రీస్తుకు సమర్పణ అనేక ముఖ్యమైన పరిణామములకు దారితీస్తుంది. అయితే మన ఉద్దేశముల కొరకు, దేవుని ప్రత్యక్షతగా లేఖనము పట్ల కూడా మనము సమర్పణ కలిగియుండాలి అనేది అత్యంత ప్రాముఖ్యమైన మరియు అభ్యాసికమైన పరిణామముగా ఉన్నది.

యేసుతో లేక మొదటి శతాబ్దపు పాలస్తీనా రాబ్బాయిలతో సుపరిచితులైన ప్రతి ఒక్కరు, దేవుని యొక్క విశేష ప్రత్యక్షతగా యేసు పాత నిబంధన లేఖనముల వైపు చూశాడని గుర్తిస్తారు. ఆయన ఎన్నడు లేఖనములను ప్రశ్నించలేదుగాని, వాటికి పూర్తిగా సమర్పించుకున్నాడు మరియు సమర్పించుకోవాలని ఇతరులను కూడా ప్రోత్సహించాడు. మన ఆలోచనలు, కార్యములు మరియు భావనలలో మార్గదర్శిగా ఉండుటకు ఆదికాండము మొదలుకొని మలాకీ వరకు ఉన్న లేఖనముల మీద ఆధారపడాలని ఆయన ఉదారహరణ ఆయన అనుచరులకు ఉపదేశిస్తుంది. దీనికి మించి, మన గొప్ప బోధకునిగా, యేసు ఆయన శిష్యులైన అపొస్తలులను సంఘము కొరకు ఒక అధికారిక ప్రత్యక్షతను నిర్మించుటకు అభిషేకించాడు, మరియు వారి ప్రత్యక్షత క్రొత్త నిబంధనలో అమోఘమైన రీతిలో క్రోడీకరించబడింది.

కాబట్టి, దేవుని యొక్క ఉన్నతమైన ప్రత్యక్షతగా క్రీస్తు వైపు చూచు వారు ఆయన మాదిరిని అనుసరించాలి మరియు నేటి ఆయన ప్రజల కొరకు పాత మరియు క్రొత్త నిబంధనలను దేవుని యొక్క విశేష ప్రత్యక్షతగా అంగీకరిస్తూ ఆయన బోధకు లోబడియుండాలి.

మన దినములలో దేవుని ప్రత్యక్షత సృష్టి మరియు లేఖనములలో కనిపిస్తుంది అని మనము చూశాము కాబట్టి, ఇప్పుడు విశేష మరియు సాధారణ ప్రత్యక్షత మధ్య ఉన్న అనుబంధముల వైపు మన ధ్యాసను మళ్లించుదాము. ఈ రెండు ప్రత్యక్షతలలో దేనిని మనము నిర్లక్ష్యము చేయకూడదని గ్రహించుటకు ఈ అనుబంధములు మనకు సహాయం చేస్తాయి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# అనుబంధములు

ఈ అంశములోని రెండు విషయములను మనము చూద్దాము: సాధారణ మరియు విశేష ప్రత్యక్షతల యొక్క అతివ్యాప్తి; మరియు రెండు రకముల ప్రత్యక్షతల యొక్క అవసరత. మొదట సాధారణ మరియు విశేష ప్రత్యక్షతల యొక్క అతివ్యాప్తిని మనము చూద్దాము.

## అతివ్యాప్తి

సాధారణ మరియు విశేష ప్రత్యక్షతలను గూర్చి మనము ఎన్ని సార్లు వేర్వేరుగా మాట్లాడినా, ఈ రెండు విధములైన ప్రత్యక్షతలు చాలా వరకు ఒకదానిపై ఒకటి అతివ్యాప్తి చెందుతాయని కూడా మనము గుర్తించవలసిన అవసరం ఉన్నది. దీనిని చూచుటకు, ఈ రెండు ప్రత్యక్షతలో కనిపించు ముఖ్య విషయముల యొక్క భిన్నత్వమును మనము గుర్తించాలి.

ఒక వైపు, లేఖనములలో విశేష ప్రత్యక్షత అనేక అంశములను గూర్చి మాట్లాడుతుంది మరియు దీని ద్వారా అసాధారణమైన మరియు అత్యంత సామన్యమైన విషయముల మధ్య ఒక అవిభక్తత ఏర్పడుతుంది. బైబిలులోని కొన్ని భాగములు ఎంత అసాధారణమైనవంటే దైవిక నడిపింపు లేకుండా సామాన్యమైన అనుభవములు లేక అభిప్రాయముల ద్వారా వాటిని ఎవ్వరు వ్రాయలేరు. బైబిలులోని ఈ భాగములు గోప్యమైనవి — అవి అసాధారణమైన, అసామాన్యమైన రీతులలో ఇవ్వబడినవి. బైబిలులో ఇట్టి రకములైన విషయములకు అత్యంత స్పష్టమైన ఉదాహరణలు దానియేలు, యోవేలు మరియు ప్రకటన గ్రంథములలోని భాగములు. ఈ వాక్య భాగములను వ్రాసిన ప్రజలు తమ సమాచారమును వారికి ప్రత్యేకముగా ఇవ్వబడిన దర్శనములు మరియు ఇతర అసామాన్యమైన ప్రత్యక్షతల ద్వారా పొందుకున్నారు. ఈ విధంగా, లేఖనములోని ఈ భాగములను మనము "అత్యంత విశేషమైన ప్రత్యక్షత" అని పిలువవచ్చు.

దీనికి తోడు, గోప్యమైన విషయములు మరియు సామాన్య మాధ్యమాల ద్వారా ఆత్మ అనుగ్రహించు విషయముల యొక్క కలయికను చూసే ఒక మధ్యము లేఖనములో కనిపిస్తుంది. ఉదాహరణకు, బైబిలు సంబంధమైన చారిత్రిక పుస్తకమైన రాజులు గ్రంథము లేక లూకా సువార్తను చూడండి. ఈ పుస్తకములోని ఆలోచనలను సాధారణ మానవ వనరుల నుండి సేకరించారని ఈ పుస్తకముల యొక్క రచయితలు చాలా స్పష్టముగా తెలియజేశారు. రాజుల గ్రంథములు ఇశ్రాయేలు మరియు యూదా దేశముల యొక్క రాజకీయ సంఘటనలను ప్రస్తావిస్తుంది. లూకా తన సమాచారమును క్రీస్తు జీవితమును కనులారా చూసిన ప్రత్యక్ష సాక్షుల నుండి సేకరించినట్లు చెబుతున్నాడు. దేవుని ఆత్మ ఈ బైబిలు రచయితలను నడిపించిన ప్రకారం విశేషమైన అసాధారణమైన మూలాధారములను కూడా వారు ఖచ్చితముగా జోడించారు. వారి మూలాధారములలో వారు పొందిన సమాచారము యొక్క ఖచ్చితత్వమును గూర్చి వారు మెళుకువలను కలిగియుండిరి, తమ మూలాధారములను ఎలా అనువదించాలో వారు ఎరిగియుండిరి, మరియు సాధారణమైన

మాధ్యమాలలో దొరకని సమాచారమును గూర్చి కూడా వారు మెళుకువలు కలిగియుండిరి. కాబట్టి, ఈ విధంగా, బైబిలులోని ఈ భాగములు గోప్య విషయములను మరియు సామాన్య విషయములను మిళితము చేస్తాయి.

దీనిని మించి, లేఖనములోని అనేక భాగములు సామన్య మెళుకువల కంటే ఎక్కువగా ప్రేరిత మెళుకువలు కలిగియున్నవి. ఎందుకంటే సామాన్య అనుభవములను గూర్చి సరైన పరిశీలనలు చేయుటకు బైబిలు రచయితలను పరిశుద్ధాత్మ తరచుగా ప్రేరేపించాడు. ఉదాహరణకు, సామెతలు 30:25లో రచయిత ఇలా అంటున్నాడు:

> చీమలు బలములేని జీవులు అయినను అవి వేసవిలో తమ ఆహారమును సిద్ధపరచుకొనును (సామెతలు 30:25).

ఈ కథనము ప్రేరేపితమైనది మరియు సత్యమైనది, కాని దీనిని రచయిత ఒక గోప్యమైన దర్శనము ద్వారా పొందలేదుగాని ప్రకృతిని అనుభవించుట ద్వారా పొందాడు.

కాబట్టి, ఈ విధంగా, విశేష ప్రత్యక్షతలో మనము చాలా సార్లు సాధారణ ప్రత్యక్షతగా పరిగణించు, అనగా లోకములో ఎవరైనా ఆచరణాత్మకముగా గమనించగల అనేక విషయములు ఉన్నాయి. బైబిలులోని ఈ భాగములు "సాధారణము చేయబడిన విశేష ప్రత్యక్షత"లైయున్నవి అని కూడా చెప్పవచ్చు.

ఇప్పుడు, విశేష ప్రత్యక్షతలో వలెనె, సాధారణ ప్రత్యక్షతలో కూడా విభిన్న రకములైన అంశములు ఉన్నాయి. ఒక వైపు, సాధారణ ప్రత్యక్షతలో చాలా సామాన్యమైన విషయములు ఉంటాయి, అనగా లోకములో ఇప్పటి వరకు నివసించిన మానసికముగా ఆరోగ్యవంతమైన ప్రజలందరు ఎరిగియున్న విషయములు. లోకము విశాలమైనది అని, ఒక విశాలమైన ఆకాశము దానిపై ఉన్నదని ఇంచుమించు అందరికీ తెలుసు. మరియు తమ నైతిక మనసాక్షిని అనుభవించిన సమయములు ఇంచుమించు అందరికీ జ్ఞాపకముంటాయి. ఈ సార్వత్రిక అనుభవములన్ని దేవునిని మరియు మానవుల పట్ల ఆయన చిత్తమును ఎల్లప్పుడూ బయలుపరచాయి. వీటిని మనము "అత్యంత సాధారణమైన ప్రత్యక్షతలు" అని పిలువవచ్చు.

సాధారణ ప్రత్యక్షతల యొక్క మధ్య భాగములో సాధారణ ప్రత్యక్షత యొక్క సామాన్య మరియు అసామాన్యమైన విషయముల యొక్క మిశ్రమాలు ఉన్నాయి. ఇవి కేవలం కొందరికి మాత్రమే ఇవ్వబడిన సృష్టి అనుభవాలు, ఎందుకంటే ఇవి కాలము లేక స్థానము వంటి కొన్ని పరిమితులు కలవైయున్నవి. ఉదాహరణకు, భయంకరమైన గాలివాన యొక్క గాలులు కూడా దేవుని యొక్క మహా శక్తిని ప్రచురపరుస్తాయి. కాని చాలా మంది ప్రజలు ఎన్నడును గాలివానను అనుభవించరు. హిమాలయా పర్వతముల యొక్క ఎత్తులు దేవుని మహిమను ప్రచురపరుస్తాయి, కాని మానవజాతిలో చాలా మంది హిమాలయాలను ప్రత్యక్షంగా చూడలేదు. మనమంతా అనేక పరిమితులు కలిగియున్నాము కాబట్టి, సాధారణ ప్రత్యక్షతలన్నీ అన్ని సమయాలలో అందరికీ వర్తించవు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఈ వర్ణమాల యొక్క మరొక వైపు సాధారణ ప్రత్యక్షత యొక్క అసామాన్యమైన అంశములు ఉన్నాయి, అనగా దేవుడు బయలుపరచిన కొన్ని సత్యములను ప్రజలు తమకున్న విశేషమైన జ్ఞానముతోను మరియు తమ మతపరమైన నమ్మకములలో కూడా ఒప్పుకొను సమయములు. వాస్తవమేమిటంటే చాలా సార్లు మనము విశేష ప్రత్యక్షత అని భావించు విషయములు సాధారణ ప్రత్యక్షతలో భాగమైయున్నాయి. ఉదాహరణకు, ఒకే దేవుడు ఉన్నాడని కొన్ని క్రైస్తవేతర మతములు కూడా నమ్ముతాయి. నిజమైన క్రైస్తవ విశ్వాసము వలెనె అనేక మతములు సామాన్యమైన మరియు పవిత్రమైన విషయముల మధ్య భేదమును గుర్తిస్తాయి. అనేక మతములు హత్యను ఖండిస్తాయి. సామాన్య సామాజిక న్యాయమును పలు విశ్వాసములు ప్రశంసిస్తాయి. పురాతన బైబిలు లోకములో, ఇతర మతములు కొన్ని విశేషమైన మార్గములలో నిజమైన బైబిలు విశ్వాసమును ప్రతిబింబించేవి. మరియు నేడు కూడా, కొందరు సువార్త అందని ప్రజలు కూడా క్రైస్తవ విశ్వాసమునకు అనుగుణంగా ఉన్న నమ్మకములను కలిగియున్నారని కొందరు మిషనరీలు నివేదిస్తారు. అట్టి సందర్భాలలో, మనము "విశేషమైన సాధారణ ప్రత్యక్షత"ను గూర్చి మాట్లాడవచ్చు.

కాబట్టి, వేదాంతశాస్త్రములో విశేష మరియు సామాన్య ప్రత్యక్షతల యొక్క పాత్రలను గూర్చి మనము ఆలోచన చేయుచుండగా, చాలాసార్లు మరచిపోయే రెండు విషయములను మనము జ్ఞాపకముంచుకోవాలి. ఒక వైపు, గోప్యముకాని లేక ఇతర మార్గములలో తెలుసుకొనుటకు కష్టముకాని కొన్ని విషయములను లేఖనములు మనకు బోధిస్తాయి. సామాన్యమైన మరియు సాధారణ ప్రత్యక్షత ద్వారా వివేచింపబడగల విషయములను గూర్చి కూడా దైవిక అధికారముతో అవి బోధిస్తాయి. ఇందు వలననే మనము లేఖనములను, మతపరమైన మరియు నైతిక విషయములలో మాత్రమే గాక చరిత్ర మరియు విజ్ఞాన విషయములలో కూడా, మన అధికారముగా పరిగణిస్తాము.

మరొక వైపు, సామాన్యముగా లేఖనముల కొరకు ప్రత్యేకపరచు విషయములను గూర్చి సాధారణ ప్రత్యక్షత మనకు అనేక విషయాలను బోధించగలదని కూడా మనము గుర్తించాలి. వాస్తవానికి, ఈ పాఠములలో మనము చూడబోతున్నట్టు, లేఖనములో తెలియజేయబడిన అనేక వేదాంతశాస్త్ర సత్యములు సాధారణ ప్రత్యక్షత ద్వారా బయలుపరచబడినవి. అందుకనే క్లిష్టమైన మతసంబంధ విషయములలో కూడా దైవిక నడిపింపు కొరకు మనము సాధారణ ప్రత్యక్షత మీద ఆధారపడాలి.

వేదాంతశాస్త్ర విశ్లేషణ కొరకు సాధారణ మరియు విశేష ప్రత్యక్షతలు అందించదగిన అనేక సంగతులను మనము గుర్తించాము గనుక, ఇప్పుడు రెండవ విషయమును చూద్దాము. వేదాంతశాస్త్రము కొరకు ఈ రెండు రకముల ప్రత్యక్షతలు మనకు ఎందుకు అవసరమైయున్నవి? వేదాంతశాస్త్ర అన్వేషణలో ఇవి మనకు ఎలా సహాయపడగలవు?

## అవసరత

ఒక వైపు, విశేష ప్రత్యక్షత అనేక విధములుగా సామన్య ప్రత్యక్షతను మించిపోతుంది గనుక మనకు విశేష ప్రత్యక్షత అవసరమైయున్నది. సాధారణ ప్రత్యక్షత కంటే ఎక్కువగా దేవుని మరియు ఆయన చిత్తమును తెలియజేయుటకు, స్పష్టపరచుటకు మరియు బయలుపరచుటకు విశేష ప్రత్యక్షత రూపొందించబడినది. ఈ మధ్య దశాబ్దాలలో అనేక మంది వేదాంతశాస్త్రవేత్తలు గమనించినట్టు, వారు పాపములో పడక మునుపే, వారు నిష్కళంక స్థితిలో ఉన్నప్పుడే దేవుడు ఆదాము హవ్వలకు విశేష మరియు సాధారణ ప్రత్యక్షతలను అనుగ్రహించాడు. ఆదాము హవ్వలు పాప రహితులుగా ఉండెను కాబట్టి వారు సృష్టిని వీక్షించుచుండగా దేవుని గూర్చి మరియు ఆయన చిత్తమును గూర్చి మరి ఎక్కువగా తెలుసుకొనియుండిరని మనము నిర్ధారణ కలిగియుండవచ్చు. అయినను, పాపమునకు మునుపు కూడా, విశేష ప్రత్యక్షత యొక్క నడిపింపు లేకుండా కేవలం సృష్టిని పరిశీలించుట ద్వారా మాత్రమే వేదాంతశాస్త్రము నిర్మించియుండకూడదు. మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షమును గూర్చి, తోటను సంరక్షించుటను గూర్చి, వృద్ధి చెందుటను గూర్చి, తోట యొక్క పొలిమేరలుదాటి వ్యాపించుటను గూర్చి, మరియు భూమిమీదంతట అధికారమును కలిగియుండుటను గూర్చి దేవుడు ఆదామునకు విశేష సూచనలతో కూడిన ప్రత్యేకమైన మాటలను ఇచ్చాడు.

అంతేగాక, లోకములోనికి పాపము ప్రవేశించిన తరువాత, విశేష ప్రత్యక్షత దేవుని యొక్క విమోచన ప్రణాళిక మీద కూడా దృష్టిపెట్టింది. సాధారణ ప్రత్యక్షత మనము దేవుని తీర్పు క్రింద ఉన్నామని బయలుపరచుచున్నప్పటికీ, కేవలం విశేష ప్రత్యక్షత మాత్రమే క్రీస్తులో రక్షణను బయలుపరుస్తుంది. ముఖ్యముగా పాపములోనికి పడినది మొదలుకొని, కొన్ని సార్లు ప్రాకృతిక వేదాంతశాస్త్రము అని పిలువబడిన సాధారణ ప్రత్యక్షతలో నుండి వెలువడు వేదాంతశాస్త్ర నిర్మాణము యొక్క ప్రక్రియ, ఖచ్చితముగా విశేష ప్రత్యక్షత ద్వారా నడిపింపబడవలసియున్నది. లేనియెడల, దేవుడు సృష్టిలో బయలుపరచిన విషయములను మనము దుర్వినియోగించు అవకాశములు ఎక్కువగా ఉన్నాయి.

మనకు లేఖనము యొక్క అవసరతను మనస్సులో ఉంచుకొని, సాధారణ ప్రత్యక్షత యొక్క అవసరతను కూడా మనము చూడాలి. కేవలం బైబిలు ఆధారంగా మన వేదాంతశాస్త్రమును కట్టుట ఎందుకు సరిపోదు? లేఖనములో కనిపించని ఏ విషయములను సాధారణ ప్రత్యక్షత మనకు అందిస్తుంది?

ఇప్పుడు, మనము ముందు చెప్పినట్లే, లేఖనముల యొక్క అధికారిక నడిపింపు లేకుండా మనము ప్రకృతిని లేక సాధారణ ప్రత్యక్షతను సమీపించలేము. అయితే అదే సమయములో, లేఖనములు కేవలం కొన్ని విషయములను మాత్రమే సూటిగా తెలియజేస్తున్నాయని, మరియు సాధారణ ప్రత్యక్షత యొక్క విశాలతతో పోల్చుకుంటే లేఖనములు కేవలం కొన్ని విషయములను గూర్చి మాత్రమే మాట్లాడుతున్నాయని మనము గ్రహించాలి. విశేష ప్రత్యక్షత మనకు తెలియజేయు విషయాలకు సాధారణ ప్రత్యక్షత సందర్భమును

సమకూర్చుతుంది. మనము ముందు పాఠములలో నేర్చుకున్న నియమమును అనువర్తించుటకు, సాధారణ మరియు విశేష ప్రత్యక్షతల యొక్క పలు అంశములు బహుళ పరస్పరతల యొక్క వలయాలకు దారితీస్తాయి.

సాధారణ ప్రత్యక్షత యొక్క ఈ పాత్ర కనీసం రెండు మార్గములలో కనిపిస్తుంది. ఒక వైపు, సాధారణ ప్రత్యక్షతను గూర్చి మనము నేర్చుకొను విషయములు విశేష ప్రత్యక్షతను అర్థం చేసుకొనుటలో మనకు సహాయపడతాయి. దీనిని గూర్చి ఈ విధంగా ఆలోచించండి. లేఖనముల యొక్క ప్రత్యక్షతను పొందుకొనుటకు ఒక వ్యక్తి ఒక భాషను చదువువానిగా ఉండాలి, లేక కనీసం కొంత వరకైనా అర్థం చేసుకొనేవానిగా ఉండాలని మనకు తెలుసు. అయితే ఇతర పుస్తకముల యొక్క సహాయం లేకుండా మనలో ఎంత మంది బైబిలులోని మాటలను మాత్రమే ధ్యానించుట ద్వారా ఒక భాషను చదువుటను లేక అర్థము చేసుకొనుటను నేర్చుకున్నారు? దీనికి ఖచ్చితమైన జవాబు "ఎవరూ లేరు." మనలో చాలా మందిమి భాషను తల్లితండ్రుల ద్వారా లేక సంరక్షకుని ద్వారా, సృష్టిలోని ఇతర పదార్థములకు చెందిన వస్తువులు మరియు క్రియల యొక్క సహాయంతో నేర్చుకున్నాము. మరియు తరువాత చదవటం కూడా అదే విధంగా నేర్చుకున్నాము.

సాధారణ ప్రత్యక్షతలో నేర్చుకొనిన విషయముల మీద నిర్మించుట ద్వారా మాత్రమే తరువాత మనము బైబిలును సమీపించగలిగితిమి. వాస్తవానికి, లేఖనముల దగ్గరకు వచ్చేసరికి సాధారణ ప్రత్యక్షత మీద మన ఆధారం దీని కంటే లోతైనదిగా ఉన్నది. సాధారణ ప్రత్యక్షత ద్వారా ప్రజలు నేర్చుకొన్న విషయాలు లేకపోతే నేడు మనకు చదువుటకు బైబిళ్ళు కూడా ఉండేవి కావు. బైబిలు యొక్క అనువాదకులు అనువాదము చేయుటను నేర్చుకుంటారు; ముద్రణకర్తలు ముద్రించుట నేర్చుకున్నారు; ప్రచురణకర్తలు ప్రచురించుటను కూడా చాలా వరకు సాధారణ ప్రత్యక్షత నుండి నేర్చుకున్నారు. ఈ అతి సామాన్యమైన విధములలో, మనము సాధారణ ప్రత్యక్షత పట్ల ఆసక్తిని చూపించాలి ఎందుకంటే విశేష ప్రత్యక్షతను చదువుటలో అది మనకు సహాయం చేస్తుంది.

మరొక వైపు, బైబిలును ఫలవంతముగా అన్వయించుటకు కూడా సాధారణ ప్రత్యక్షత అవసరమైయున్నది. ఉదాహరణకు, బైబిలు అనేక అంశములను గూర్చి మాట్లాడుతుంది మరియు అనుసరించుటకు అమోఘమైన నియమములను ఇస్తుంది. అయినను, ఈ నియమాలను అన్వయించుటకు అవి అన్వయించబడుతున్న సృష్టిని గూర్చి మనము ఎరిగినవారముగా ఉండాలి.

భర్తలు భార్యలను ప్రేమించాలని బైబిలు చెబుతుంది, కాని ఈ బైబులు నియమమును అన్వయించుటకు సాధారణ ప్రత్యక్షతలోని కొన్ని సంగతులను మనము ఎరిగినవారమైయుండాలి. భర్త అంటే ఏంటి? భార్య అంటే ఏమిటి? ఆ సందర్భములో ఒక భార్యను ప్రేమించుట అంటే అర్థము ఏమిటో కూడా మనము ఎరిగినవారమైయుండాలి. ఈ విధంగా, లేఖనము యొక్క నమ్మకమైన అనువర్తన ఎల్లప్పుడు దేవుని యొక్క సాధారణ ప్రత్యక్షత మీద ఆధారపడియుంటుంది.

కాబట్టి, ఒక్క మాటలో, దేవుడు తనను తాను సాధారణ మరియు విశేష ప్రత్యక్షతలలో బయలుపరచుకొన్నాడని, మరియు ఆయన ప్రత్యక్షతను మనము సృష్టిలోను మరియు లేఖనములలోను



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

చూడాలని ఆయన ఆశించుచున్నాడని మనము చూస్తాము. ఏ ఒక్క ప్రత్యక్షత కూడా ఒంటరిగా నిలువబడుటకు రూపొందించబడలేదు. మన వేదాంతశాస్త్రమును నిర్మించుచుండగా మనము రెంటిని పట్టుకొనునట్లు దేవుడు నిర్ణయించాడు.

క్రైస్తవులు దేవుని యొక్క స్వయం-ప్రత్యక్షతను విశేష మరియు సాధారణ ప్రత్యక్షతలలో కలిపి కనుగొనాలని మనము చూశాము కాబట్టి, ఇప్పుడు మన రెండవ అంశమును చూద్దాము: వేదాంతశాస్త్రమును దానిలో నుండి వెలికితీయుటకు మనము ప్రత్యక్షతను ఎలా అర్థము చేసుకోవాలి?

## ప్రత్యక్షతను అర్థము చేసుకొనుట

ఇక్కడ మనమొక ముఖ్యమైన వ్యత్యాసమును గమనించాలి. ఒకరు మీకు బహుమతిని ఇచ్చుట ఒక ఎత్తైతే, దానిని సరిగా ఉపయోగించుట మరొక ఎత్తైనట్లే, ఆయన ప్రత్యక్షతను దేవుడు మనకిచ్చుట ఒక ఎత్తైతే, దానిని వేదాంతశాస్త్రములో సరిగా ఉపయోగించుట మరొక ఎత్తవుతుంది. ఇప్పుడు, ఆయన ఆరాధనకు యోగ్యుడని మరియు వారి తిరుగుబాటు వలన వారు దేవుని తీర్పు ఎదుట నిలువబడతారని తెలుసుకొనుటకు ప్రజలకు కావలసిన స్పష్టతను ఇచ్చునట్లు దేవుడు తనను తాను సృష్టిలో బయలుపరచుకున్నాడని రోమా. 1 బోధిస్తుంది. అయినను, సాధారణ మరియు విశేష ప్రత్యక్షతను ఈ సామాన్య స్థాయిలకు మించి అర్థము చేసుకొనుట సులువైన పని కాదు; అది ఒక క్లిష్టమైన విశ్లేషణా ప్రక్రియ.

ప్రత్యక్షతను అర్థము చేసుకొను ఈ ప్రక్రియ ఎలా జరుగుతుందో తెలుసుకొనుటకు, మనము మన ఆసక్తిని మూడు దిశలపై కేంద్రీకరించుదాము: మొదటిది, పాపము యొక్క ఆటంకమును గూర్చి నేర్చుకుందాము; రెండవది, పరిశుద్ధాత్మ వెలిగింపును గూర్చి నేర్చుకుందాము; మరియు తరువాత, మూడవది, ఈ మన వేదాంతశాస్త్రము మీద ఈ క్రియాశీలకము యొక్క ప్రభావములను చూద్దాము. మొదటిగా, దేవుని ప్రత్యక్షతను అర్థము చేసుకొనుటకు ప్రయత్నించుచుండగా పాపము ఎలా ఆటంకం కలిగిస్తుందో చూద్దాము.

### పాపము యొక్క ఆటంకం

ఇది చాలా బాధాకరమైన విషయం అయినప్పటికీ, పాపము మానవుల మీద ఎంత గాఢమైన ప్రభావమును చూపిందంటే, ఒకవేళ దేవుడు దానిని పట్టించుకోకుండా ఊరకుంటే మనము ఆయన ప్రత్యక్షతను మన శక్తి అంతటితో వ్యతిరేకించేవారమని మనము గుర్తించాలి. దేవుని యొక్క సాధారణ మరియు విశేష కృప లేకపోతే, దేవుని ప్రత్యక్షతలో నుండి మన వేదాంతశాస్త్రమును గుర్తించుటకు మరియు అభివృద్ధి చేయుటకు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మనము చేసే ప్రతి ప్రయత్నం విఫలమవుతుంది. సాంప్రదాయిక వేదాంతశాస్త్ర పదములలో, ఈ సమస్యను చాలా సార్లు "పాపము యొక్క మానసిక ప్రభావములు" అని పిలుస్తారు, మరియు ఇది గ్రీకు పదమైన *ΠΠΠΠ* (νοῦς) నుండి వెలువడింది, దీని అర్థము మనస్సు.

పాపము యొక్క ఈ మానసిక ప్రభావములను తెలుసుకొనుటకు, మొదటిగా పాపము సాధారణ ప్రత్యక్షతను చూడకుండా మన మనస్సులకు ఎలా అంధత్వం కలిగిస్తుందో చూద్దాము, మరియు తరువాత అది విశేష ప్రత్యక్షతను చూడకుండా ఎలా అంధత్వం కలిగిస్తుందో చూద్దాము.

## సాధారణ ప్రత్యక్షత

భూమి మీద ప్రతి మనిషి కొంత వరకు సాధారణ ప్రత్యక్షతను ఎరిగినవాడైయున్నప్పటికీ, మనకు తెలిసిన విషయములలో చాలా వాటిని మనము అడ్డగించునట్లు పాపము చేస్తుంది మరియు సాధారణ ప్రత్యక్షత మనకు అందించగల అనేక విషయములను చూడకుండా అంధత్వం కలిగిస్తుంది. రోమా. 1:18లో, సాధారణ ప్రత్యక్షత యొక్క సత్యమును ఎరిగిన పాపభరితమైన అన్యులు "దుర్నీతిచేత సత్యమును అడ్డగించు"దురని పౌలు చెబుతున్నాడు. మరొక మాటలో, సృష్టిలో స్పష్టముగా బయలుపరచబడిన సత్యమును అడ్డగించున్నట్లు పాపము మనలను పురికొల్పుతుంది; మనము తిరస్కరించి సాధారణ ప్రత్యక్షత నుండి దూరమైపోతాము. సాధారణ ప్రత్యక్షతలో బయలుపరచబడిన నైతిక నియమాలను అవిశ్వాసులు ఉల్లంఘించినప్పుడు, దేవుడు వారిని "వారి హృదయముల యొక్క దురాభిలాషలకును," "తుచ్ఛమైన అభిలాషలకును," మరియు "భ్రష్ట మనస్సుకును" అప్పగించెనని పౌలు వ్రాస్తున్నాడు.

మనము ఒక బయర్లుకమ్మిన లేక పాడైపోయిన కనుచూపును కలిగియుండునట్లు దురభిలాష మరియు భ్రష్టత్వము మన హృదయములను నడిపించుచున్నవి. సాధారణ ప్రత్యక్షతలోని సత్యమును దేనిని మనము చూడలేము అని కాదు. కాని, దేవుని కృపకు వహీనులమగునంతగా, మన భ్రష్ట ఆశలతో సాధారణ ప్రత్యక్షత యొక్క సత్యములను మనకు అనుకూలంగా మలచుకొనుచున్నాము. మనము సత్యమును అబద్ధమని, మరియు అబద్ధములను సత్యమని పిలచుచున్నాము; మనము మంచిని చెడు అని, మరియు చెడును మంచి అని పిలచుచున్నాము.

సాధారణ ప్రత్యక్షతను సరిగా ఉపయోగించకుండా పాపము మనలను ఏ విధముగా భ్రష్టులుగా చేసినదో చూశాము గనుక, ఇప్పుడు మన ధ్యాసను విశేష ప్రత్యక్షత వైపు మళ్లించుదాము. విశేష ప్రత్యక్షత మీద, ముఖ్యముగా లేఖనములో దేవుని ప్రత్యక్షతను మనము ఉపయోగించు విధానము మీద పాపము ఎలాంటి ప్రభావము చూపుతుంది?

## విశేష ప్రత్యక్షత

దేవుని కృప లేకుండా పాపులైన మానవులు లేఖనము యొక్క బోధను వ్యతిరేకిస్తారని బైబిలు స్వయంగా చెబుతుంది. పరిసయ్యులు పాత నిబంధనను తప్పుగా ఉపయోగిస్తున్నారు అని చెప్పినప్పుడు, యోహాను 5:39-40లో యేసు దీనిని గూర్చి మాట్లాడాడు. ఇతర లేఖనముల వలెనె ప్రజలు పౌలు యొక్క రచనలను కూడా తప్పుగా అర్థము చేసుకుంటారని పౌలు రచనలను గూర్చి మాట్లాడుతూ 2 పేతురు 3:15-16లో పేతురు వ్యాఖ్యానిస్తాడు. దేవుని కృప లేకుండా, పాపులైన మానవులు లేఖనములను తప్పుగా ఉపయోగిస్తారు మరియు తప్పుగా అర్థము చేసుకుంటారు.

పాపముతో బైబిలును తప్పుగా అనువదించుట అను సమస్య కేవలం అవిశ్వాసులకు మాత్రమే పరిమితమైనది కాదు; అది విశ్వాసులకు కూడా సోకుతుంది. 17వ, 18వ మరియు 19వ శతాబ్దములలోని ఎంతో మంది ఐరోపా మరియు అమెరికా వేదాంతశాస్త్ర పండితులు ఆఫ్రికా బానిసల యొక్క వ్యాపారమును బైబిలు సమర్థిస్తుంది అని నమ్మారు అనేది నాకు గుర్తుకు వచ్చు ఒక ఉదాహరణ. ఇది ఎలా జరిగింది? క్రైస్తవులు లేఖనములను ఆ విధంగా ఎలా అడ్డదోవలో అనువదించగలరు? పాపము లేఖనములను అనువదించు మన శక్తికి కూడా ఆటంకం కలిగిస్తుంది అనేది ఈ ప్రశ్నకు జవాబు. మన పాండిత్యము యొక్క బలము ఎంత ఉన్నా లేక మన బైబిలు జ్ఞానము యొక్క లోతు ఎంత ఉన్నా, మనమంతా కూడా ఏదో ఒక విధంగా విశేష ప్రత్యక్షతను మళ్లిస్తున్నాము లేక భ్రష్టు పట్టిస్తున్నాము అని పూర్తిగా నిర్ధారణ చెందాలి. మన బలహీనతలు మరియు పక్షపాతములను గూర్చి మనము ఎంతగా తెలుసుకుంటే, అంతగా మనము ఇట్టి పొరపాట్లను అధిగమించగలుగుతాము, కాని బైబిలును అపార్థం చేసుకొనిన కొన్ని మార్గములను తెలుసుకోకుండానే మనము మరణిస్తాము.

దేవుని ప్రత్యక్షతను వేదాంతశాస్త్రమును నిర్మించునప్పుడు మనము ఎదుర్కొను అనేక సమస్యలను గూర్చి పాపము యొక్క మానసిక ప్రభావమును వివరిస్తాయి. లేఖనములు మరియు సృష్టి రెండు దేవుని మరియు ఆయన చిత్తమును మనకు బయలుపరుస్తాయి, కాని దేవుని ప్రత్యక్షతను అనువదించు మనము పాపులమైయున్నాము. మనము సృష్టి లేక లేఖనములో ఆయన ప్రత్యక్షతను ఎల్లప్పుడూ అర్థము చేసుకోలేము. పడిపోయిన లోకములో వేదాంతశాస్త్రమును నిర్మించుటలో గల విషాదకరమైన సత్యమిది.

సాధారణ మరియు విశేష ప్రత్యక్షతను ఉపయోగించు మన సామర్థ్యముపై పాపము లోతైన ప్రభావమును ఎలా చూపుతుందో తెలుసుకున్నాము కాబట్టి, ఇప్పుడు ప్రత్యక్షతను అర్థము చేసుకొనుటకు మనము కలిగియున్న ఉత్తమమైన నిరీక్షణ వైపుకు మన దృష్టిని మళ్లించుదాము: పరిశుద్ధాత్మ వెలిగింపు.

## పరిశుద్ధాత్మ వెలిగింపు

ప్రత్యక్షత నుండి నిజమైన వేదాంతశాస్త్రమును నిర్మించుట మన జీవితములలో పరిశుద్ధాత్మ యొక్క వ్యక్తిగత పరిచర్య ద్వారా కలుగుతుంది అని చాలా సార్లు క్రైస్తవులు గ్రహించలేకపోతారు. బదులుగా, మానవులుగా మనము కలిగియున్న స్వాభావిక సామర్థ్యతల మీద వారు తమ నిశ్చయతను నిలుపుతారు. జ్ఞానోదయ ఆధునికవాదం తరువాత కూడా, మనము హేతువాదులమై దేవుని ప్రత్యక్షతకు చక్కగా-నిర్వచించబడిన పద్ధతులను అన్వయించగలిగితే నిజమైన వేదాంతశాస్త్రమును నిర్మించగలమని అనుకుంటాము. కాని వాస్తవానికి, మన హేతువాద సామర్థ్యతలు సృష్టిలో మన పడిపోయిన స్థితికి తటస్థంగా ఉండలేవు. పడిపోయిన స్థితిలో, పాపము మన మనస్సులకు గుడ్డితనము కలిగిస్తుంది, మన భాష మరియు తార్కిక సామర్థ్యతలతో సహా, కాబట్టి చాలా సార్లు మనము ప్రత్యక్షతను సరిగా అర్థము చేసుకోలేకపోతాము. దీనికి మించినది ఒకటి అవసరమైయున్నది; మన హేతువాద, భాషా మరియు అనుభవ సామర్థ్యములను బలపరచునది ఒకటి అవసరమైయున్నది; సాధారణ మరియు విశేష ప్రత్యక్షతలను ఉన్నవి ఉన్నట్టుగా అర్థము చేసుకొనుటలో మరియు తద్వారా నిజమైన వేదాంతశాస్త్రమును నిర్మించు శక్తినిచ్చు ఒకటి కావాలి. అంధత్వం కలిగిన మన కన్నులకు కేవలం దేవుని ఆత్మ వెలిగింపు మాత్రమే అట్టి వెలుగును తీసుకొనిరాగలదు.

ఆత్మ వెలిగింపును నేర్చుకొనుటకు, ఆయన మొదట విశేష ప్రత్యక్షతలోనికి ఎలాంటి మెళకువలను ఇస్తాడో మరియు తరువాత సాధారణ ప్రత్యక్షతను చూచుటకు కూడా మన కన్నులను ఎలా తెరుస్తాడో మొదట చూద్దాము.

### విశేష ప్రత్యక్షత

సాంప్రదాయిక ప్రొటెస్టెంట్ వేదాంతశాస్త్రములో "వెలిగింపబడుట" అనే పదము ఎక్కువగా విశేష ప్రత్యక్షత యొక్క జ్ఞానమును కలిగించుటకు ఆత్మ చేయు కార్యమునకు ఉపయోగించబడుతుంది. పరిశుద్ధాత్మ మన లోపల కార్యము చేస్తాడు, మన మనస్సులను నూతనపరుస్తాడు, తద్వారా మనము దేవుని వాక్యమును అర్థము చేసుకొనవచ్చు, అంగీకరించవచ్చు మరియు అన్వయించవచ్చు. ఈ సత్యమును ఎఫెసీ. 1:17-19లో పౌలు తెలియజెప్పిన విధానమును చూడండి:

> . . . మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క దేవుడైన మహిమ స్వరూపియగు తండ్రి, తన్ను తెలిసికొనుటయందు మీకు జ్ఞానమును ప్రత్యక్షతయునుగల మనస్సు అనుగ్రహించునట్లు, నేను నా ప్రార్థనలయందు మిమ్మునుగూర్చి విజ్ఞాపన చేయుచున్నాను (ఎఫెసీ 1:17-19).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇప్పుడు, ఆత్మ కలుగజేయు విశేష ప్రత్యక్షత యొక్క వెలిగింపు పలు విధములలో పని చేస్తుంది అని గుర్తించుట ఎంతో ప్రాముఖ్యమైయున్నది. ఒక వైపు, దేవుని ఆత్మ విమోచనేతర మార్గములలో పని చేస్తాడని, తద్వారా విశేష ప్రత్యక్షత యొక్క అనేక అంశాలను అవిశ్వాసులు కూడా అర్థం చేసుకుంటారని లేఖనములు స్పష్టము చేస్తున్నాయి. సంఖ్యా. 24:2 ప్రకారం, దేవుని ఆత్మ అన్యమత ప్రవక్తయైన బిలాము మీదికి వచ్చి అతనికి మెళకువలు ఇచ్చింది. మరియు యోహాను 11:49-51లో, యేసు సిలువవేయబడుటలో ముఖ్య పాత్ర పోషించిన ప్రధాన యాజకుడైన కయప యేసు సిలువ మరణమును గూర్చి నిజముగా ప్రవచించాడు. మత్తయి సువార్త 21 వ అధ్యాయములో, దుర్మార్గులైన కాపులవారిని గూర్చిన ఉపమానము తమను గూర్చి చెప్పబడింది అని పరిసయ్యులు గ్రహించారు, కాని దానికి వారు హత్యా వ్యూహంతో స్పందించారుగాని నిజమైన పశ్చాత్తాపము వారికి కలుగలేదు. అదే విధంగా, హెబ్రీ పత్రిక రచయిత 6:4లో, ప్రజల జీవితములో ఆత్మ ద్వారా వెలిగింపబడుటను గూర్చి ప్రత్యేకంగా మాట్లాడాడు కాని తరువాత వారి రక్షణను ప్రశ్నించాడు.

"సామాన్య కృప" సందర్భములో ఈ ఉదాహరణలను మనము "ఆత్మ యొక్క సామాన్య కార్యములు" అని పిలువవచ్చు. ఇవి ఆత్మ లోకములో జరిగించుచున్న విమోచనేతర పాత్రలలో కొన్ని. ఇందువలననే అవిశ్వాసులు కూడా లేఖనములకు అనుగుణంగా ఉన్న వేదాంతశాస్త్రమును గ్రహించగలరు మరియు బోధించగలరు. వారు విమోచింపబడకపోయినప్పటికీ, ఇది వారి జీవితములలో ఆత్మ కార్యమునకు ఫలితముగా ఉన్నది.

అదే సమయములో, సంఘము ఆత్మ యొక్క దేవాలయమని కూడా గుర్తుంచుకొనుట ప్రాముఖ్యమైయున్నది. సంఘము లోకములో ఆయన ప్రత్యేక సన్నిధి మరియు పరిచర్యకు స్థావరముగా ఉన్నది. ఆయన విమోచించబడిన ఆయన ప్రజలకు దేవుని వాక్యము యొక్క రక్షణ జ్ఞానమును అనుగ్రహిస్తాడు. ఆత్మ యొక్క వెలిగించు కార్యము అవిశ్వాసులలో కంటే ఎక్కువగా విశ్వాసులలో పని చేస్తుంది అని ఆశించుట కూడా సరైనదే. వాస్తవానికి, అవిశ్వాసుల కంటే విశ్వసించు వేదాంతశాస్త్రవేత్తలు ఆత్మ నుండి ఎక్కువగా నేర్చుకొనవచ్చు అని ఆశించుట సరైనదే.

విశేష ప్రత్యక్షత విషయములో ఆత్మ మన మనస్సులను వెలిగించు ముఖ్యమైన పాత్ర ప్రతి క్రైస్తవ వేదాంతశాస్త్రవేత్త గుర్తుంచుకోవలసిన ఒక ప్రాముఖ్యమైన విషయమును లేవనెత్తుతుంది. కేవలం దేవుని ఆత్మ మాత్రమే మనలను వెలిగించగలదు కాబట్టి, క్రైస్తవ వేదాంతశాస్త్రవేత్తలు మనఃపూర్వకముగాను నిజాయితీగాను ఆత్మ ఆధీనములో ఉండుటకు ప్రయత్నించాలి. క్రైస్తవ వేదాంతశాస్త్రమనేది మనము మన సొంత శక్తితో సాధించగల ఒక పురుషహీనమైన పని కాదు. మన విశేష ప్రత్యక్షత నుండి నిజమైన వేదాంతశాస్త్రమును రూపొందించాలని మనము ఆశిస్తున్నట్లయితే, పరిశుద్ధాత్మతో ఉన్నతమైన వ్యక్తిగత అనుబంధము మరియు ఆయన కార్యము పట్ల పవిత్రమైన నిబద్ధత అవసరమైయున్నవి. కృపా ఆత్మ యొక్క నడిపింపుకు హృదయపూర్వకముగా మనలను మనము సమర్పించుకున్నప్పుడు మాత్రమే మన వేదాంతశాస్త్ర అంశములు లేఖనములలో నుండి సరైన మార్గములలో వెలికితీయబడినవని నిరీక్షించుటకు అవకాశముంటుంది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఆత్మ యొక్క విశేష ప్రత్యక్షతా వెలిగింపును దృష్టిలో ఉంచుకొని, ఇప్పుడు మనము వెలిగింపబడుట మరియు సాధారణ ప్రత్యక్షత వైపు మళ్లుదాము. లేఖనములను సరిగా అర్థము చేసుకొనుటకు మరియు అన్వయించుటకు కావలసిన విషయము చాలా మంది క్రైస్తవులకు సుపరిచితమైయున్నది, అది ఆత్మ వెలిగింపు మనకు కావాలి. అదే సమయములో, సాధారణ ప్రత్యక్షతను సరిగా ఉపయోగించు సామర్థ్యమును కూడా ఆత్మ స్త్రీ పురుషులకు అనుగ్రహిస్తాడని మనము గుర్తుంచుకోవాలి.

## సాధారణ ప్రత్యక్షత

ఈ సత్యమును మనము లేఖనములో చూచుటకు అనేక మార్గములున్నాయి. లేఖనములు ఈ విషయమును గూర్చి మాట్లడు ఒక ముఖ్యమైన మార్గము జ్ఞాన సిద్ధాంతము. బైబిలులో, జ్ఞానము అనేది దేవుడిచ్చిన సరైన అవగాహనగా ఉన్నది మరియు ఇది సామాన్య ప్రత్యక్షత మీద దృష్టి పెడుతుంది. అయితే జ్ఞానము ఎక్కడ నుండి వస్తుంది? దేవుని ఆత్మ జ్ఞానమును బోధిస్తాడు.

దానియేలు 5:14లో, దానియేలు యొక్క జ్ఞానము దేవుని నుండి వచ్చిన జ్ఞానమని అన్యమత రాజైన బెల్షస్సరు గుర్తించాడు. సమస్త జ్ఞానము దేవుని యొద్ద నుండి వస్తుందని సామెతలు 2:6లో మనము చదువుతాము. అదే విధంగా, నిర్గమ 31:3 ప్రకారం, కళాకారులైన బెసలేలు మరియు అహోలీయాబులు పరిశుద్ధాత్మతో నింపబడియుండిరి గనుక తమ కళను సక్రమముగా చూపగలిగారు. ఆత్మ వెలిగింపు కేవలం విశేష ప్రత్యక్షతకు మాత్రమేగాక సామాన్య ప్రత్యక్షతకు కూడా అవసరమే అని ఇవి మరియు ఇలాంటి విషయములను గూర్చి మాట్లాడు ఇతర లేఖన భాగములు మనకు బోధిస్తాయి.

సాధారణ ప్రత్యక్షతలో ప్రజలు సమస్త విధములైన సత్యమును కనుగొనునట్లే ఆత్మను గూర్చి ఆయన రచించిన ఇన్స్టిట్యూట్స్ *అఫ్ ద క్రిస్టియన్ రిలీజియన్* అను పుస్తకము యొక్క రెండవ పుస్తకము, రెండవ అధ్యాయములో కెల్విన్ ఏమంటున్నాడో వినండి:

> ఈ విషయాలను మనము లౌకిక రచయితల రచనలలో గమనించినప్పుడెల్లా, మానవుని మనస్సు, పతనమై దాని ఆరోగ్యవంతము నుంచి వక్రీకరింపబడినప్పటికిని, దేవుని శ్రేష్టమైన వరములతో కప్పబడి అలంకరింపబడినదని మనకు ఉపదేశించడానికి, పొగడదగిన సత్యమును గూర్చిన ఆ వెలుగు వాటిలో ప్రకాశింపనీయవలెను. మనము దేవుని ఆత్మను, సత్యమును గూర్చిన ఏకైక ఊటగా పరిగణించినట్లయితే, దేవుని ఆత్మను అగౌరవపరచగోరితే తప్ప, అది అగుపించినప్పుడెల్లా మనము అట్టి సత్యమును తృణీకరించము, సరికదా దానిని తిరస్కరించము . . . కాని మనకు భౌతికశాస్త్రము, అభిప్రాయంలోని సత్యాన్ని పరిశోధించే కళ, గణితం, మరియు

ఇటువంటి ఇతర శాస్త్రములలో సహాయం లభించవలెననునది దేవుని చిత్తమైనట్లయితే, దైవభక్తిలేనివారు పని మరియు పరిచర్యతో, వీటి తోడ్పాటును వినియోగించుకొందాము.

ఇక్కడ కెల్విన్ చెబుతున్నట్టు, సాధారణ ప్రత్యక్షత యొక్క సత్యమును దేవుని ఆత్మ విశ్వాసులకు మరియు అవిశ్వాసులకు కూడా బోధిస్తాడు. ఆయన మాత్రమే సత్యమునకు ఊటగా ఉన్నాడు. ఈ కారణము చేత, క్రైస్తవ వేదాంతశాస్త్రమును శరీరము యొక్క శక్తితో నిర్మించుటకు ప్రయత్నించుట, సాధారణ ప్రత్యక్షతకు సంబంధించిన విషయములను గూర్చి కూడా, శరీరము యొక్క శక్తితో రక్షణను పొందుకొనుటకు ప్రయత్నించునంత మూర్ఖత్వమవుతుంది.

ఇదంతా ఏమి చెబుతుంది అంటే, దేవుని పత్యక్షత నుండి వేదాంతశాస్త్రమును విజయవంతముగా రాబట్టుట అనేది స్వయంచలితముగా జరుగునది కాదు లేక మీరు లేక నేను మన సొంత శక్తితో చేయదగినది కాదు. సరైన విధముగా ప్రత్యక్షతను అర్థము చేసుకొనుట అనేది నమ్రతను కలిగించు మతపరమైన అనుభవమైయున్నది మరియు దానిలో మనము నిరంతరము మన స్వాభావిక సామర్థ్యతల యొక్క పరిమితులను జ్ఞాపకముంచుకొంటు దేవుని ఆత్మ మీద మన ఆధారమును ఎడతెగక నూతనపరుస్తుంటాము.

## ఫలితములు

సాధారణ మరియు విశేష ప్రత్యక్షతలను అర్థము చేసుకొనుటలో పాపము మరియు ఆత్మ అను క్రియాశీలకములు వేదాంతశాస్త్ర నిర్మాణ ప్రక్రియలో కొన్ని ఫలితాలను ఊహించునట్లు మనలను సిద్ధపరుస్తుంది. చాలాసార్లు పాపము మరియు ఆత్మ మధ్య కలుగు ఉద్రిక్తత, విశేష మరియు సాధారణ ప్రత్యక్షతలలో మనము కనుగొను విషయముల మధ్య పొసగని పరిస్థితులను ఎదుర్కొనునట్లు చేస్తుంది.

లేఖనములలో మనము నమ్ము ప్రతిది సాధారణ ప్రత్యక్షతను గూర్చి మనము కలిగియున్న అవగాహనలోనికి సులువుగా ఇమిడినంత వరకు వేదాంతశాస్త్రమును నిర్మించుట చాలా సులభమైన పని అవుతుంది. ఉదాహరణకు, విజ్ఞాన ఆధారములు దానికి మద్దతునిచ్చునంత వరకు బైబిలు చారిత్రికముగా సత్యమని నమ్ముట కష్టమనిపించదు. దొంగతనము వలన కలుగు అనేక సామాజిక కీడులను చాలా మంది నమ్ముతారు కాబట్టి దొంగిలించుట నేరం అని నమ్మటం కష్టమనిపించదు.

అయితే మనము ఒకరితో ఒకరము నిజాయితీగా ఉందాము. చాలా సార్లు, మనము బైబిలులో ఒక విషయమును చదువుతాము, మరియు లోకములో దానికి పూర్తిగా భిన్నముగా ఉన్న విషయమును చూస్తాము. మన జీవిత అనుభవములో నుండి మనము ఒక విషయమును నేర్చుకుంటాము, కాని తరువాత బైబిలు దానికి పూర్తిగా వ్యతిరేకముగా ఉన్న విషయమును బోధిస్తుంది అని గమనిస్తాము. ఇప్పుడు మనము చూసినట్లుగా, సాధారణ మరియు విశేష ప్రత్యక్షతల మీద ఆధారపడుట ద్వారా క్రైస్తవులు తమ వేదాంతశాస్త్రమును నిర్మించాలి. కేవలం విశేష ప్రత్యక్షతను లేక సాధారణ ప్రత్యక్షతను తిరస్కరించుట ద్వారా



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మనము ఈ సమస్యలను పరిష్కరించలేము. ప్రత్యక్షత యొక్క ఈ రెండు మూలముల మధ్య ఏర్పడు వివాదముల వంటి ఈ పరిస్థితులను మనము ఎలా ఎదుర్కొనగలము? విజ్ఞాన ఆవిష్కరణములను లేక సామాన్య అనుభవములను తిరస్కరించు విషయములను బైబిలులో కనుగొనినప్పుడు మనము ఏమి చెయ్యాలి?

మొదటిగా, సాధారణ మరియు విశేష ప్రత్యక్షతలు ఎన్నడూ ఒకదానితో ఒకటి వ్యతిరేకముగా ఉండవనే ధృడమైన నిశ్చయతతో అట్టి పరిస్థితులలోనికి మనము ప్రవేశించాలి. సాధారణ మరియు విశేష ప్రత్యక్షతల రెంటిలోను, ఒకే దేవుడు మాట్లాడుచున్నాడు — ఆయన అబద్ధమాడనేరడు గనుక కేవలం సత్యము పలుకు దేవుడు. అంతేగాక, సృష్టి అంతటిలోను మరియు లేఖనములోను ఆయన బయలుపరచువాటిని ఏకము చేయుట దేవునికి కష్టమైన పని కాదని కూడా మనము గుర్తించాలి. ప్రత్యక్షత యొక్క ఈ రెండు మూలములు ఎంత వ్యత్యాసము కలిగినవిగా అనిపించినా, ఆ రెండు వాస్తవముగా నిజమైనవి మరియు ఒకదానితో ఒకటి పొంతన కలవని మనకు దేవుని దృష్టి కోణము నుండి తెలుస్తుంది.

రెండవ స్థానంలో, విశేష మరియు సాధారణ ప్రత్యక్షతల నుండి తెలుసుకున్న విషయములను గూర్చి మనము మాట్లాడునప్పుడు, మనము కేవలం ప్రత్యక్షతతో మాత్రమే వ్యవహరించుటలేదుగాని, ప్రత్యక్షతను గూర్చిన మన అవగాహనలతో, మరియు పూర్ణతకు ఎల్లప్పుడు దూరంగా ఉండు అవగాహనలతో వ్యవహరించుచున్నామని మనము జ్ఞాపకముంచుకోవాలి. విశేష మరియు సాధారణ ప్రత్యక్షతలు దేవుని యొద్ద నుండి వచ్చుచున్నవి కాబట్టి అవి ఎన్నడును వివాదించనప్పటికీ, వాటిని గూర్చిన మన అవగాహనలు ఖచ్చితముగా వివాదించవచ్చు ఎందుకంటే అవి మన నుండి వచ్చునవి.

కాబట్టి, విశేష మరియు సాధారణ ప్రత్యక్షతల మధ్య భేదములను మనము గమనించినప్పుడు, ఆ పరిస్థితిని విశ్లేషించుటకు నాలుగు ముఖ్యమైన మార్గములు ఉన్నాయి.

మొదటిది, విశేష ప్రత్యక్షతను మనము అపార్థము చేసుకొనుట సాధ్యమే మరియు బైబిలును తిరస్కరించకుండా మన లేఖన అనువాదమును మనము మార్చవలసియున్నది. రెండవది, సాధారణ ప్రత్యక్షతను మనము అపార్థము చేసుకున్నప్పుడు వివాదము తలెత్తవచ్చు. చాలా సార్లు, లేఖనముల ద్వారా సరిచేయబడవలసిన అనుభవము నుండి మనము ఆలోచనలను రూపొందించవచ్చు. మూడవదిగా, మనము విశేష మరియు సాధారణ ప్రత్యక్షతలను రెంటిని అపార్థము చేసికొనియుండవచ్చు. లోకములో మనము కలిగియున్న అనుభవములు లేఖన బోధకు అనుగుణంగా లేకపోవుట చాలా సార్లు సాధ్యము కావచ్చు, ఎందుకనగా లేఖనములను సరిగా అర్థము చేసుకొనుటలో మరియు మన అనుభవములను సరైన విధముగా విశ్లేషించుటలో మనము విఫలులమయ్యాము. నాల్గవదిగా, మానవ గ్రహణ శక్తికి మించిన ఒక రహస్యమును మనము ఎదుర్కొనియుంటాము. ఉదాహరణకు, సాధారణ ప్రత్యక్షతలో మనకున్న అనుభవము ద్వారా ఒక వ్యక్తి మూడు వేర్వేరు వ్యక్తిత్వములలో ఉనికిలో ఉండుటను మనము ఊహించలేము. అయినను, దేవుని గూర్చి

బైబిలు మనకు బోధించునది ఇదే. ఈ రెండు ఆలోచనలను మనము ఎలా సమాధానపరచగలము? సాధ్యము కాదు. త్రిత్వ సిద్ధాంతము మన ఆలోచనకు మించిన రహస్యమైయున్నది.

ఇప్పుడు, ఈ నాలుగు పరిస్థితులలో దేనిని మనము అనుభవిస్తున్నామో ఎల్లప్పుడూ ఆచరణాత్మకముగా చెప్పలేము. కాబట్టి, చాలా సార్లు మనము రుజువు యొక్క భారమును ఎక్కడ మోపుతామో దాని మీద మాత్రమే ఆధారపడాలి. రుజువు యొక్క భారమును మన లేఖన అనువాదము మీద ఉంచుతామా లేక మన సాధారణ ప్రత్యక్షత యొక్క అనువాదము మీద ఉంచుతామా? సరే, ఈ విషయములో క్రైస్తవులు వేర్వేరు దిశలను అనుసరిస్తారు.

ఒక వైపు, "ఎక్కువ ఉదారవాదులు" అని మనము పిలచు క్రైస్తవులు లేఖనముల అవగాహన కంటే ఎక్కువగా సాధారణ ప్రత్యక్షత మీద వారికున్న అవగాహనను అంగీకరిస్తారు. అయితే "ఎక్కువ సాంప్రదాయికమైన" వారని మనము పిలచు క్రైస్తవులు ఒక వివాదము తలెత్తినప్పుడు విశేష ప్రత్యక్షత మీద వారికున్న అవగాహనను అంగీకరిస్తారు. వీటిలో రెండవ ప్రణాళిక ఉత్తమమైనదిగా ఉన్నది. సాధారణ ప్రత్యక్షత యొక్క విశ్లేషణలలో పుట్టు రుజువు గొప్పదిగా ఉంటె తప్ప, లేఖనముల యొక్క బోధను మనము అనుసరించాలి. జీవితమును అర్థము చేసుకొనుటకు మనకు మార్గదర్శిగా క్రీస్తు మరియు అపొస్తలులు లేఖనములను ప్రతిపాదించారు. కాబట్టి, వివాదములు తలెత్తినప్పుడు మనము లేఖనముల మాటను వినుటకు సిద్ధముగా ఉండాలి. 2 తిమోతి 3:16-17లో పౌలు చెబుతున్నట్టు:

> దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము . . . (2 తిమోతి 3:16-17).

అయితే, అదే సమయములో మన లేఖనముల అవగాహన పాపము ద్వారా దోషపూరితమైనది కాబట్టి, మంచి విశ్వాసముతో ఈ సమస్యలను మరలా మరలా పరిగణించాలని ఎల్లప్పుడూ మనము జ్ఞాపకముంచుకోవాలి. బైబిలును గూర్చి వారు కలిగియున్న అవగాహనలను తరువాత మార్చుకోవాలని తెలిసియున్నప్పటికి కూడా, తమ ఆలోచనలను బైబిలు బోధనలని వారు నమ్ము వాటి ఆధీనములో ఉంచుకొనుట అనేది అనేక యుగములుగా నమ్మకమైన విశ్వాసులు చేసిన పని. ఈ విధమైన జ్ఞానము మరియు సమర్పణ, బైబిలు మనకు బోధిస్తున్నది అని నమ్ము విషయముల మీద ఆధారపడి వేదాంతశాస్త్రమును నిర్మించాలని పిలుపునిస్తుంది.

ప్రత్యక్షత నుండి వేదాంతశాస్త్రమును రాబట్టుట పాపం మరియు ఆత్మ అను క్రియాశీలకముల ద్వారా కలుగు సమస్యలతో ముడిపడియున్నదను సత్యము ఈ పాఠంలోని ,మూడవ ముఖ్య అంశము వైపుకు మనలను నడిపిస్తుంది: అట్టి క్లిష్టమైన పరిస్థితిలో, మన వేదాంతశాస్త్ర స్థానముల మీద నిశ్చయతను ఎలా అభివృద్ధి చేయగలుగుతాము?

# నిశ్చయతను అభివృద్ధి చేయుట

ఇవాంజెలికల్ క్రైస్తవుల మధ్యలో ప్రఖ్యాతిగాంచిన నినాదం ఒకటి ఈ విధంగా ఉంది. “దేవుడు చెప్పాడు; నేను నమ్మాను; ఇది దీనిని నిర్ధారిస్తుంది.” చాలా విధములుగా ఈ కథనము నిజమైయున్నది. ఈ పాఠం అంతటిలో మనము చెబుతున్న విషయాలను అది చెబుతుంది. దేవుడు ఒక విషయమును బయలుపరిస్తే, దానిని మనము నమ్మాలి మరియు అది నిర్ధారించబడాలి. అయితే దేవుని ప్రత్యక్షతను మనము ఎల్లప్పుడూ సరైన విధముగా అర్థము చేసుకోలేము అనే విషయమును ఈ నినాదము ఉపేక్షిస్తుంది. దేవుడు చెబుతున్నాడు అని మనము నమ్మినంత మాత్రానే ఆయన నిజముగా చెప్పాడని అర్థము కాదు. కాబట్టి, మనము ఒక గంభీరమైన ప్రశ్నను అడగాలి: దేవుని ప్రత్యక్షతను మనము సరిగా అర్థము చేసుకున్నామని, మరియు నిశ్చయముగా “దేవుడు దానిని చెప్పాడు; ఇది దీనిని నిర్ధారిస్తుంది” అనే నిశ్చయతను మనము ఎలా అభివృద్ధి చేసుకోగలము?

వేదాంతశాస్త్రములో నిశ్చయతను అభివృద్ధి చేసుకొనుట అనే అంశమును చూచుటకు, మనము మూడు విషయములను చూద్దాము: మొదటిగా, వేదాంతశాస్త్ర స్థానములకు సమధర్మ గుణమున్నది; రెండవదిగా, వినయ ప్రక్రియ ద్వారా సామాన్యముగా నిశ్చయత ఎలా కలుగుతుందో చూద్దాము; మరియు మూడవదిగా, పలు వేదాంతశాస్త్ర స్థానముల మీద నిశ్చయత యొక్క తగిన అమరికను ఎలా స్థాపించాలో చూద్దాము. వేదాంతశాస్త్ర అంశముల మీద ఉన్న నిశ్చయతకు ద్వైదేహిక గుణము కాక సమధర్మ గుణమున్నదనే ఆలోచనను మొదట చూద్దాము.

## సమధర్మ గుణము

ఈ భేదమును అర్థము చేసుకొనుటకు రెండు సామన్య రకములైన లైట్ స్విచ్చుల యొక్క ఉదాహరణను చూచుట ఉపయోగకరముగా ఉంటుంది. సులువైన ఆన్-ఆఫ్ స్విచ్ ను ద్వైదేహికము అని పిలువవచ్చు. అయితే అది ఆన్ అయినా అవుతుంది లేకపోతే ఆఫ్ అయినా అవుతుంది. ఈ రకమైన స్విచ్చు అనేక మంది ఇవాంజెలికల్ క్రైస్తవులు తమ నమ్మకములను గూర్చి ఆలోచించు విధానమును పోలియున్నది.

వారు చాలా సార్లు విషయములను గూర్చి మాకు తెలిసినవి మరియు మాకు తెలియనివి అన్నట్లు సులభంగా ఆలోచన చేస్తారు. “క్రీస్తు దేవుని కుమారుడని నేను నమ్ముచున్నాను.” “దేవుడు త్రియేకుడని నేను నమ్ముచున్నాను.” ఈ ప్రకటనలు ధృడమైన నమ్మకములుగా ఉన్నాయి. అయినను, తెలుసుకొనుట అసాధ్యము లేక తెలియనివి అని ఇవాంజెలికల్ క్రైస్తవులు పరిగణించు అనేక విషయములు కూడా ఉన్నాయి. “మంచి దేవుడు కీడు జరుగుటకు ఎందుకు అవకాశం ఇస్తాడో నాకు తెలియదు.” “క్రీస్తు ఎప్పుడు తిరిగి వస్తాడో నాకు తెలియదు.” ఏమి ఆలోచన చెయ్యాలో మనకు తెలియదు అని ఇలాంటి కథనములు సూచిస్తాయి; ఈ

అంశముల మీద ప్రజలు చేసిన వ్యాఖ్యల మీద మనకు నమ్మకము లేదు. వేదాంతశాస్త్ర నమ్మకముల పట్ల ఇట్టి ద్వైదేహికమైన ఆలోచన అనేక సందర్భాలలో ఉపయోగకరంగా ఉంటుంది. “దీనిని గూర్చి నాకు తెలుసు, అయితే దానిని గూర్చి నాకు తెలియదు” అని చెప్పుట ఒక రకమైన క్లుప్త వివరణ అవుతుంది. అయినను, క్రైస్తవులుగా మనకు తెలిసిన మరియు తెలియని అనేక విషయములను మరింత దగ్గరగా పరిశీలించినప్పుడు, ద్వైదేహిక పద్ధతి సూచించుచున్నంత సులువుగా పరిస్థితి లేదని వెంటనే మనకు అర్థమవుతుంది.

ఇప్పుడు, వెలుగును తగ్గించు స్విచ్చులు కూడా మనలో చాలా మందికి తెలుసు, ఈ స్విచ్చులలో పలు రకముల పెంచు మరియు తగ్గించు సెట్టింగులు ఉంటాయి. ఈ రకమైన స్విచ్చులను సమధర్మ స్విచ్చులు అంటారు. వీటిలోని కరెంటు కేవలం ఆన్ మరియు ఆఫ్ మాత్రమే అవ్వదుగాని, కరెంటు ఎక్కువ లేక తక్కువ శక్తితో ప్రవహిస్తుంది. రెండు కోనలలో మాత్రం, కరెంటు పూర్తిగా అయినా ఉంటుంది లేక అసలు ఉండదు గాని, మధ్యలో ఉన్న మెట్లు కూడా ప్రాముఖ్యమైనవైయున్నాయి, ఎందుకంటే అవి తక్కువ లేక ఎక్కువ వెలుగును అవసరమునకు అనుగుణంగా ఇస్తాయి.

అనేక విధాలుగా, ఈ సమధర్మ లైట్ స్విచ్చులు పలు వేదాంతశాస్త్ర స్థానముల మీద మనము కలిగియుండవలసిన నిశ్చయతను విశ్లేషించుటకు ఒక ఉపయోగకరమైన విధానమును అందిస్తాయి. కొన్ని నమ్మకములలో పూర్తి నిశ్చయత కలిగి మరికొన్నిటిలో అసలు నిశ్చయత లేనివారముగా మనము ఉండలేము; వేదాంతశాస్త్ర స్థానములలో పలు స్థాయిలలో ఎక్కువ లేక తక్కువ నిశ్చయతలు ఉన్నాయి.

వేదాంతశాస్త్రమునకు వెలుపల ఉన్న విషయములను గూర్చి మనము ఆలోచించు విధానములను గూర్చి ఆలోచన చెయ్యండి. ప్రతి మానవుడు అనేక నమ్మకములను పట్టుకొనియుంటాడు. ఉదాహరణకు, నేడు వర్షము పడదని నేను నమ్ముతాను. ఒక సెమినరీలో అధ్యాపకునిగా నాకు ఉద్యోగము ఉన్నదని నేను నమ్ముతాను. మరియు నాకు ఒక మనవరాలు ఉన్నదని నేను నమ్ముతాను. ఇప్పుడు, ఈ విషయములన్ని సత్యములని నేను నమ్ముచున్నాను అని చెప్పినప్పటికీ, ఈ నమ్మకముల మీద నేను అదే స్థాయిలో నిశ్చయత కలిగియుండను.

వీటిలో ఒకొక్క నమ్మకమును విడిచిపెట్టుటకు నేను ఎంత ఒత్తిడిని ఉపయోగించవలసియున్నది అని అడుగుట నా నిశ్చయత యొక్క స్థాయిని పరీక్షించుటకు ఒక మార్గమైయున్నది. ఈ రోజు వర్షము పడదు అను నమ్మికను మార్చుకొనుట అంత కష్టము కాదని నేను నిజాయితీగా చెప్పగలను. నా తల మీద కొన్ని వర్షపు చినుకులు పడితే చాలు, నేను పరిగెడతాను; వర్ష సూచన ఎక్కువగా ఉన్నదని ఇవ్వబడిన వాతావరణ హెచ్చరిక వలన కూడా నేను బయటకు వెళ్లినప్పుడు గొడుగును తీసుకొని వెళ్తాను. ఆ నమ్మకము మీద నాకు ఎక్కువ నిశ్చయత లేదు. ఒక సెమినరీలో అధ్యాపకునిగా నాకు ఉద్యోగమున్నదను విషయము మీద నేను మరి ఎక్కువ నిశ్చయత కలిగియుంటాను. నా బోధించు ఉద్యోగము స్థిరమైనదని నాకు అన్ని విధముల నిశ్చయత ఉన్నది, కాబట్టి నేను ఆ నమ్మకము మీద ఎక్కువ శక్తిని వెచ్చించాను. టీవీలో వచ్చు రిపోర్ట్ కూడా ఈ విషయములో నా మనస్సును మార్చలేదు. నాకు ఒక పత్రము అందినా గాని, నేను దానిని వ్యక్తిగతముగా

నిర్ధారించుకోవాలని ఆశపడతాను. అయతే నాకు మనవరాలు ఉన్నది అనే నమ్మకమును తొలగించుటకు ఏమి జరగాలో ఒక సారి ఆలోచించండి. నా నమ్మకమును అనేక విషయములు నిర్ధారిస్తున్నాయి, మరియు ఆమె నాకు ఎంతగానో ప్రియమైనది, కాబట్టి ఆమె లేదని నేను నమ్ముటకు ఊహించలేనంత ఎక్కువ రుజువు, అనగా ఈ పట్టికలో ఉన్న దాని కంటే మరి ఎక్కువ రుజువు నాకు అవసరమైయున్నది.

ఇప్పుడు, సామాన్య అనుభవములలో ఏది సత్యమైయున్నది అది వేదాంతశాస్త్రములో కూడా సత్యమైయున్నది. వేదాంతశాస్త్ర నమ్మకములను మనము నిశ్చయత యొక్క పలు స్థాయిలలో కలిగియుంటాము. మునుపటి పాఠంలో మనము క్రైస్తవ సిద్ధాంతములను గూర్చి మాట్లాడుతూ, అభ్యాసములు మరియు భావనలు పలు పరస్పరతల యొక్క వలయమును రూపొందిస్తున్నాయి అని చెప్పాము. ఈ సమయములో మనము ఈ విధానమును కొంత విశదీకరించవలసియున్నది. ఈ పలు పరస్పరతల యొక్క వలయము ద్రవ గోళములో ప్రేలాడదీయబడినది అని ఆలోచించుట ఉపయోగకరముగా ఉంటుంది. ఈ గోళమును విభిన్న భాగములుగా విభజించి దాని లోపలి భాగమును బహిర్గతం చేసినప్పుడు, మన నమ్మకముల వలయము ఒకదానిలో మరొకటి చక్రముల రూపములో పొరలుగా అమర్చియుండుట చూడవచ్చు.

బయట పొరలలో, మన నమ్మకములు వదులుగా ఆకృతి చెందుతాయి. బయట పొరలు మన నమ్మకముల వలయములో కైవారమునకు చెందిన అనేక వేదాంతశాస్త్ర స్థానములకు ప్రాతినిధ్యం వహిస్తుంది. వాటిని గూర్చి మనకు చాలా తక్కువ నిశ్చయత ఉంటుంది; వాటి పట్ల మనము తక్కువ సమర్పణ కలిగినవారిగా ఉంటాము మరియు అన్ని వేళల సులువుగా ఈ నమ్మకములను మార్చుతూ, తొలగిస్తూ మరియు జోడిస్తూ ఉంటాము.

మధ్యలో, లేక గోళము యొక్క కేంద్రములో, మన నమ్మకముల వలయము ఎంత గట్టిగా అల్లుకుపోతుందంటే అది ఒక ఐక్యపరచబడిన ధృడమైన వస్తువుగా ఉంటుంది. మన వలయము యొక్క మధ్య భాగములో ముఖ్యమైన ఆలోచనలు, అనగా మనము ఎంతో ఎక్కువ నిశ్చయతతో పట్టుకొను మన విశ్వాసము యొక్క కేంద్ర వేదాంతశాస్త్ర విషయములు ఉంటాయి. ఈ కేంద్ర నమ్మకములను మార్చుట, వాటిలో నుండి తొలగించుట లేక జోడించుట చాలా కష్టమవుతుంది. ఎందుకంటే అలా చేసినప్పుడు, మనము నమ్ము ప్రతి ఇతర విషయమునకు పునరాకృతి ఇవ్వగల బలమైన తరంగ ప్రభావము ఎదురవుతుంది.

చివరిగా, కేంద్ర పొర మరియు బాహ్య పొరకు మధ్య, ఎక్కువ లేక తక్కువ బిగువగా అల్లబడిన నమ్మకముల యొక్క వలయముల ద్వారా చేయబడిన పొరల సముదాయము ఉంటుంది. కేంద్రమునకు దగ్గరగా ఉన్న పొరలు ఎక్కువ దట్టముగా ఆకృతి చెందబడియుంటాయి కాబట్టి వాటిని మార్చుట చాలా కష్టమవుతుంది. కేంద్రమునకు దూరముగా ఉన్న పొరలు తక్కువ దట్టముగా ఆకృతి చెందబడినవి కాబట్టి వాటిని మార్చుట తక్కువ కష్టమవుతుంది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇప్పుడు, నమ్మకముల యొక్క వలయముల యొక్క అమరిక ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి, ఒక సంప్రదాయము నుండి మరొక సంప్రదాయమునకు, మరియు ఒక సమయము స్థలము నుండి మరొక స్థలము సమయమునకు వేరుగా ఉంటుంది. అయినను, ప్రతి క్రైస్తవ వేదాంతశాస్త్రములోను పలు స్థాయిలలో నిశ్చయత కనిపిస్తుంది. క్రైస్తవులుగా మనము అనేక విషయములను నమ్ముతాము, కాని వాటన్నిటిని ఒకే రకమైన నిశ్చయతతో నమ్మాలని మాత్రం మనము ఆశించకూడదు. కొన్ని నమ్మికలు బయట కొనలో ఉంటాయి, మరికొన్ని కేంద్రములో ఉంటాయి, మరియు ఇంకా కొన్ని వీటికి మధ్యలో ఉంటాయి. అన్ని వేళల ఇది ఎక్కువ లేక తక్కువ నిశ్చయతకు సంబంధించిన విషయమైయున్నది. వేదాంతశాస్త్ర నిశ్చయత సమధర్మమైనదని చెప్పినప్పుడు మన అభిప్రాయము ఇదే.

నమ్మకముల వలయమును గూర్చి మన అవగాహన ఒక ప్రశ్నను లేవనెత్తుతుంది: పలు వేదాంతశాస్త్ర స్థానములకు నిశ్చయతను పలు స్థాయిలలో మనము ఎలా ఇవ్వగలము? దేవుని ప్రత్యక్షతను ఎక్కువ లేక తక్కువ నిశ్చయతతో సరిగా అర్థము చేసుకున్నామని ఏ ప్రక్రియ ద్వారా మనము నమ్మగలము? సులువుగా చెబితే, వినయముతో కూడిన సమర్పణ ప్రక్రియ ద్వారా, అనగా మనకు బోధించుటకు ఆత్మ సాధారణముగా ఉపయోగించు పలు పరికరములకు మనము సమర్పించుకొను ప్రకియ ద్వారా, పరిశుద్ధాత్మ మనకు బోధిస్తాడు మరియు నిశ్చయతను కలుగజేస్తాడు.

## వినయముతో సమర్పించుకొను ప్రక్రియ

వినయముతో సమర్పించుకొను ప్రక్రియను గూర్చి సూటిగా మాట్లాడుటకు ముందు, వేదాంతశాస్త్ర స్థానముల మీద పరిశుద్ధాత్మ మనకు నిశ్చయతను కలిగించు సామాన్యమైన మరియు అసామాన్యమైన మార్గముల మధ్య ఉన్న భేదమును చూపించాలి. సృష్టి యావత్తు మీద దేవుడు ఆయన దైవకృత నియంత్రణతో పని చేయు అనేక మార్గముల దృష్ట్యా ఈ విషయములను గూర్చి ఆలోచించుట సహాయకరముగా ఉంటుందని నేను కనుగొన్నాను.

దేవుని దైవకృతమును గూర్చి లేఖనము యొక్క బోధనను *వెస్ట్మినిస్టర్ కన్ఫెషన్ అఫ్ ఫెయిత్* చాలా చక్కగా క్రోడీకరిస్తుంది. ఐదవ అధ్యాయము, మూడవ భాగములో అది ఏమి చెబుతుందో వినండి:

> దేవుడు ఆయన యొక్క సామన్య దైవకృతములో, కొన్ని మార్గములను ఉపయోగించుకుంటాడు, కాని ఆయన చిత్తానుసారంగా అవి లేకుండా, వాటిని మించి, లేక వాటికి విరోధముగా కూడా కార్యము చేయుటకు స్వతంత్రుడైయున్నాడు.

ఇక్కడ దేవుని దైవకృతము ఎలా వివరించబడినదో గమనించండి. భూమి మీద ఆయన చిత్తమును నెరవేర్చుకొనుటకు రెండవ శ్రేణి జీవులను లేక సృష్టించబడిన పరికరములను ఎలా ఉపయోగించుకుంటాడో ఈ

కథనము వివరిస్తుంది. ఆయన రెండవ శ్రేణి జీవుల "ద్వారా" ఆయన ప్రణాళికలను సామాన్యముగా నెరవేర్చుతాడు; ఆయన లక్ష్యములను పొందుకొనుటకు సృష్టించబడిన పరికరములను ఆయన ఉపయోగిస్తాడు. కాని అదే సమయములో, దేవుడు ఈ సామాన్య మార్గమునకు మాత్రమే పరిమితము కాడు. ఈ సృష్టించబడిన పరికరములు లేకుండా, వాటిని మించి, లేక వాటికి విరోధముగా కూడా ఆయన చిత్తమును నెరవేర్చుకొనుటకు ఆయన స్వతంత్రుడైయున్నాడు.

ఇంచుమించు ఇదే విధంగా, పరిశుద్ధాత్మ మన వేదాంతశాస్త్ర స్థానములను వెలిగించు మరియు నిర్ధారించు సామాన్యమైన మరియు అసామాన్యమైన మార్గముల మధ్య కూడా భేదములను చూపుట ఉపయోగకరముగా ఉంటుంది. కాలక్రమంలో, మనము వాటి కొరకు వెదకనప్పుడు కూడా పరిశుద్ధాత్మ మనకు మెళకువలను మరియు బలమైన నిర్ధారణలను ఇస్తాడని క్రైస్తవులందరు అనుభవించియుంటారు. మనము ఊహించని సమయములో ఏదో ఒకటి మనస్సుకు వస్తుంది; వివరణ లేకుండా మనలో సమర్పణలు పుట్టుకొస్తాయి. ఇలాంటి అనేక సందర్భాలలో, దేవుని ఆత్మ సాధారణంగా ఉపయోగించుకొను రెండవ కారణములు లేకుండా, వాటికి పైన మరియు విరోధముగా కార్యము చేస్తుంటాడు. ఆత్మ యొక్క ఈ అసామాన్యమైన కార్యములు ప్రాముఖ్యమైనవే, కాని క్రమబద్ధ వేదాంతశాస్త్రములో ఆత్మ ఉపయోగించు సామన్య ప్రక్రియల పట్ల మేము ఎక్కువ ఆసక్తిని చూపుతాము.

మనము ముందుగా చూసినట్లే, సెమినరీలలో సంఘ నాయకుల యొక్క క్రమబద్ధ వేదాంతశాస్త్ర తర్ఫీదు కొరకు మూడు ప్రాథమిక అంశములను గుర్తించుట ద్వారా ఆత్మ సాధారణంగా వెలిగించు మూడు ముఖ్యమైన మార్గములను సంఘము గుర్తించింది: మొదటిది, లేఖనము యొక్క వ్యాఖ్యానమునకు సంబంధించిన బైబిలు విభాగము; రెండవది, సమాజములో పాలుపంపులకు సంబంధించిన సిద్ధాంతిక మరియు చారిత్రిక విభాగము; మరియు మూడవది, క్రైస్తవ జీవితమునకు సంబంధించిన అభ్యాసిక వేదాంతశాస్త్ర విభాగము.

ఈ జ్ఞానమునకు అనుగుణంగా, వినయముతో సమర్పించుకొను ప్రక్రియగా లేక లేఖనము యొక్క వ్యాఖ్యానము, సమాజములో పాలుపంపులు, మరియు క్రైస్తవ జీవనమునకు మనలను మనము సమర్పించుకొనుట ద్వారా ఆత్మ వేదాంతశాస్త్ర నిశ్చయతను దయచేయు సామాన్య మార్గములను కూడా వివరించుట సహాయకరముగా ఉంటుంది. ఈ మూడు ప్రభావములను గూర్చి మనము ముందు పాఠములలో మరింత విపులముగా నేర్చుకుంటాము, కాని ఇక్కడ కొంత పరిచయం మనకు సహాయకరంగా ఉంటుంది.

మొదటిగా, సరైన బైబిలు వ్యాఖ్యానము లేక అనువాదము యొక్క ప్రభావమునకు ఎలా వినయముతో సమర్పించుకోవాలో నేర్చుకొనుట ద్వారా దేవుని ఆత్మ మనలను వెలిగిస్తుంది మరియు నిర్ధారిస్తుంది. వ్యాఖ్యన శాస్త్రము, అనగా లేఖన బోధలను వివేచించు నైపుణ్యమును నేర్చుకొనుట, వెలిగించుటకు మరియు నిశ్చయతను నిర్మించుకొనుటకు అత్యంత ప్రాముఖ్యమైన, సామాన్యమైన మరియు ప్రభావవంతమైన మార్గముగా ఉన్నది. లేఖనములో దేవుడు ఏమి బయలుపరచాడో మీరు తెలుసుకోవాలని ఆశించుచున్నారా? దీనిని గూర్చి మీకు నిశ్చయత కావాలా? సామాన్యముగా, బైబిలును బాధ్యతాయుతముగా ఉపయోగించుటకు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మనలను బలపరచు వ్యాఖ్యాన నైపుణ్యతను మనము ఉపయోగించాలి. క్రైస్తవ వేదాంతశాస్త్రమును అభివృద్ధి చేయుటకు లేఖనముల వ్యాఖ్యానము పట్ల వినయముతో కూడిన సమర్పణ ఎంతో ప్రాముఖ్యమైన ప్రక్రియ కాబట్టి, రానున్న పాఠములలో ఈ అంశమును గూర్చి చర్చించుటకు ఎక్కువ సమయమును కేటాయించుదాము.

రెండవదిగా, మన మనస్సులను వెలిగించుటకు మరియు మన నిశ్చయతలను నిర్థారించుటకు దేవుని ఆత్మ సామాన్యముగా సమాజములో పాలుపంపులను ఉపయోగించుకుంటాడు. సూటైన బైబిలు వ్యాఖ్యానము యొక్క ప్రభావము మాత్రమే మనకు వేదాంతశాస్త్రములో అవసరమైయున్నది కాదు. మనకు సాధారణ ప్రత్యక్షత, ముఖ్యముగా ఇతర ప్రజలతో సంభాషించుట యొక్క సహాయం కూడా అవసరమైయున్నది. వాస్తవానికి, సమాజము లేకుండా సూటిగా వ్యాఖ్యానము చేయుట అపాయకరమైయున్నది. మనము మరలా మరలా చూస్తున్నట్టు, ఒక అబద్ధ బోధ వైపుకు మొదటి అడుగు వ్యాఖ్యానమైయున్నది. ఇతరులతో సంభాషించుట, దేవుడు ప్రత్యక్షపరచిన దానిని గూర్చి వారి అభిప్రాయములను తెలుసుకొని వాటిని విశ్లేషించుట, మన వేదాంతశాస్త్రములో కీలకమైన భాగముగా ఉండాలి. విశాలమైన ధోరణిలో, సమస్త మానవ జాతితో సంభాషణను మనకు సహాయం చేయుట కొరకు దేవుడు నియమించాడు, కాని ఆత్మ పరిపూర్ణతలో నివాసముండు విశ్వాసుల మధ్య పరస్పర సంభాషణ ఈ ప్రక్రియలో మరింత ప్రాముఖ్యమైనదిగా ఉన్నది. సమాజములో సంభాషించుచుండగా మనము ఇలాంటి ప్రశ్నలు అడుగుతాము, “ఈ విషయములను గూర్చి మునుపటి కాలములోని సంఘము ఏమి నమ్మింది? ఈ విషయమును గూర్చి లేక ఆ విషయమును గూర్చి నా చుట్టూ ఉన్న దైవికమైన విశ్వాసులు ఏమంటున్నారు? నా వ్యక్తిగత అభిప్రాయములు ఇతరుల అభిప్రాయములతో ఏ విధంగా పోలియున్నాయి? దేవుని ప్రత్యక్షతలో నుండి వేదాంతశాస్త్రమును రాబట్టు ప్రక్రియలో సమాజ సంభాషణ పట్ల వినయముతో సమర్పణ కలిగియుండుట ఎంత ప్రాముఖ్యమంటే రానున్న కాలములో ఈ అంశమును విశ్లేషిస్తూ కూడా మనము అనేక పాఠములను చూద్దాము.

మూడవదిగా, మనము ఆత్మ యొక్క నడిపింపును అనుసరించుచున్నామను నిశ్చయతను మనకు కలుగజేయుటలో క్రైస్తవ జీవనము కూడా ప్రాముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. సఫలత మరియు వైఫల్య అనుభవములు, ప్రార్థనలు, ఆరాధన, మరియు దేవుని పరిచర్య వంటివి సాధారణ ప్రత్యక్షతకు పరిమాణములుగా ఉన్నాయి మరియు ఇవి వేదాంతశాస్త్ర స్థానములను గూర్చి మనలను వెలిగించుటకు మరియు మనకు నిశ్చయతను కలుగజేయుటకు ఆత్మ సామాన్యముగా ఉపయోగించుకొను పరికరములైయున్నవి. క్రీస్తు కొరకు జీవించుట మనలను మంచి బైబిలు వ్యాఖ్యానమునకు మరియు ఇతరులతో సంభాషించుటకు సిద్ధపరుస్తుంది. మరియు నమ్మకమైన నడవడిక ద్వారా కూడా మన వేదాంతశాస్త్ర స్థానములను మనము పరీక్షించుకొనవచ్చు. క్రీస్తు కొరకు జీవించుచుండగా మనము ఏమైయున్నాము మరియు మన అనుభవములు ఏమిటి అనునది మనము సమర్పణ కలిగియుండవలసిన మూడవ ముఖ్యమైన ప్రభావముగా ఉన్నది. మన మనస్సులను వెలిగించుటకు మరియు దేవుని ప్రత్యక్షతను మనము



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

సరిగా అర్థము చేసుకున్నామనే నిశ్చయతను ఇచ్చుటకు ఆత్మ క్రైస్తవ జీవనమును ఉపయోగించుకుంటాడు. ఈ విషయముల ఆధారంగా, ఈ పాఠ్యక్రమములో అనేక పాఠములను క్రైస్తవ జీవనమును గూర్చి పరిశోధించుట కొరకు కేటాయిస్తాము.

ఇప్పటి వరకు, వేదాంతశాస్త్ర నిశ్చయత అనేది స్థాయిలకు సంబంధించినది అని మరియు మనకు నిశ్చయతను ఇచ్చుటకు దేవుని ఆత్మ సామాన్యముగా వ్యాఖ్యానము, పాలుపంపులు మరియు క్రైస్తవ జీవనము యొక్క ప్రభావములను ఉపయోగించుకుంటాడని మనము చూశాము. ఇప్పుడు, అనేక నమ్మకముల పట్ల మనము కలిగియున్న నిశ్చయతల యొక్క స్థాయిలకు తగిన అమరికను ఎలా కలిగించాలో చర్చించదగిన స్థితిలో మనము ఉన్నాము.

## తగిన అమరిక

ఈ పాఠములలో మరల మరల మనము తగిన అమరిక అనే అంశమును చూస్తాము, అయితే ఈ సమయములో దీని యొక్క మౌలిక భావమును పరిచయం చేయుట ఉపయోగరముగా ఉంటుంది. నమ్మకముల యొక్క తగిన అమరిక ఎలా పని చేస్తుందో అర్థము చేసుకొనుటకు మనము ఒక నమూనాను సూచించుదాము. ఈ నమూనాను నేను "నిశ్చయత కిరీటాకృతి" అని పిలుస్తాను.

మన నమ్మకముల వలయము యొక్క గోళములో బాహ్య కోణము నుండి మధ్య కేంద్రము వరకు కిరీటాకృతిలో త్రవ్వి దానిలో ఆ భాగమును బయటకు తీసామని ఊహించండి. ఈ కిరీటాకృతిని నిటారుగా నిలుపుట ద్వారా, గోళములోని పొరలు మనము కలిగియున్న పలు నమ్మకములను సూచించు నిశ్చయత యొక్క మెట్టు వరసను రూపొందిస్తాయి. ఈ కిరీటాకృతి యొక్క పై భాగము మన కేంద్ర నమ్మకములు; కిరీటాకృతి యొక్క క్రింద భాగము మన నమ్మకముల యొక్క బాహ్య కొనగా ఉన్నది. పైన మరియు క్రింద భాగములకు మధ్య మనము పలు స్థాయిలలో నిశ్చయత కలిగియున్న నమ్మకములున్నవి.

క్రైస్తవ వేదాంతశాస్త్రవేత్తలుగా మన నమ్మకములను ఏ స్థాయిలో ఉంచాలో నిర్ధారించుట ప్రాముఖ్యమైన బాధ్యతలలో ఒకటిగా ఉన్నది. ఒక వేదాంతశాస్త్ర స్థాయి క్రైస్తవ విశ్వాసమునకు చెందినది అని ఒకసారి నిర్ధారించిన తరువాత, దానిని నిశ్చయత కిరీటాకృతిలో ఎక్కడ ఉంచాలో మనము తెలుసుకోవాలని ఆశిస్తాము. ఉన్నత స్థాయి నిర్ధారణతో దానిని పై భాగములో ఉంచాలా? లేక తక్కువ స్థాయి నిర్ధారణతో దానిని క్రింది భాగములో ఉంచాలా?

ఇప్పుడు, కొన్ని సార్లు పరిశుద్ధాత్మ అసామాన్యమైన రీతులలో మనలో నిర్ధారణా స్థాయిలను సృష్టిస్తాడనుటలో ఏ సందేహము లేదు. చాలా తక్కువ సమర్థనతో ఒక విషయమును గూర్చి మనము సంపూర్ణ నిశ్చయత కలిగియుండవచ్చు. ఎలాంటి వివరణ ఇవ్వలేకుండా ఒక ఆలోచనను మనము సందేహించవచ్చు కూడా. కొన్ని సార్లు ఒక విషయము నిజము లేక అబద్ధము అని మనము భావిస్తాము. ఇట్టి అనుభవములతో



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మనము జాగ్రత్తగా ఉండాలి మరియు వాటిని దేవుని వాక్య ఆధారమైన విశ్లేషణకు సమర్పించుకోవాలి, కాని ఆత్మ యొక్క అసామాన్యమైన కార్యములను మనము ఉపేక్షించకూడదు.

నిశ్చయత కిరీటాకృతిలో నమ్మకములను ఎక్కడ ఉంచాలో నిర్ణయించుటకు ఆత్మ మనలను నడిపించు సామాన్య మార్గము ఏమిటి? సామాన్య పదములలో, కొన్ని విశేషతలను మినహాయిస్తే, వ్యాఖ్యానము, పాలుపంపులు మరియు క్రైస్తవ జీవనము యొక్క ప్రభావముల పట్ల నమ్మకమైన వినయముతో కూడిన సమర్పణ యొక్క పరిణామములను మన నిశ్చయత యొక్క స్థాయిలతో అమరిక చేయాలి. వాటి యొక్క ప్రభావముల క్రిందికి వచ్చుటకు మనము ప్రయత్నిస్తుండగా, మనము కలిగియున్న అనేక నిశ్చయతలను ఆత్మ తగిన అమరికలోనికి తీసుకువస్తాడు.

ఇప్పుడు, ఆచరణాత్మక స్థాయిలో, వ్యాఖ్యానము, పాలుపంపులు మరియు క్రైస్తవ జీవనము యొక్క ప్రభావములకు వినయముతో సమర్పించుకొనుట కనీసం రెండు మౌలిక ప్రశ్నలకు దారి తీస్తుంది: మొదటిది, వ్యాఖ్యానము, సమాజములో పాలుపంపులు మరియు క్రైస్తవ జీవనము ఒక అంశము మీద ఎంత వరకు పొందిక కలిగియుంటాయి? ఎంత ఎక్కువ పొందిక ఉంటె, ఒక అంశమును సరిగా అర్థము చేసుకున్నామని అంత ఎక్కువ నిర్ధారణ మనము కలిగియుండాలి. రెండవ ప్రశ్న ఈ విధంగా ఉండవచ్చు: విశేషమైన వైరస్యం ఉన్నప్పుడు, వీటిలో ఒకటి మరొక దాని మీద ఎలాంటి ఆధిపత్యము కలిగియుంటుంది? ఒకటి లేక రెండు ప్రభావముల యొక్క ఆధిపత్యము బరువుగా ఉన్నప్పుడు, ఆ నమ్మకమును నిశ్చయత కిరీటాకృతిలో ఉన్నత స్థానములో ఉంచునట్లు మనము శోధింపబడతాము. వ్యాఖ్యానము, పాలుపంపులు మరియు క్రైస్తవ జీవనము యొక్క ప్రభావములు వైరస్యం కలిగియుండి ఒకే రకమైన ఆధిపత్యము కలిగియున్నప్పుడు, ఆ నమ్మకమును నిశ్చయత కిరీటాకృతిలో క్రింది స్థానములో ఉంచునట్లు మనము శోధింపబడతాము.

ఇప్పుడు, తగిన అమరిక కార్యమును చేయుటకు ఒక యాంత్రికమైన పద్ధతి లేదనే స్పష్టతను మనము కలిగియుండాలి; ఇక్కడ ఉపయోగించుటకు గణితశాస్త్ర లెక్క ఏదియు లేదు. ఈ ప్రక్రియ ఒక విజ్ఞానము కంటే ఎక్కువగా ఒక కళయైయున్నది, మరియు ఈ పనిని చేయుచుండగా ఎల్లప్పుడు మనము దేవుని ఆశీర్వాదమును కోరాలి. అయినను, వినయముతో సమర్పించుకొను ప్రక్రియ ద్వారా ఆత్మ సామాన్యముగా ఆయన ప్రజలను నడిపిస్తాడు. వ్యాఖ్యానము, సమాజములో పాలుపంపులు, మరియు క్రైస్తవ జీవనము యొక్క ప్రభావములలో మనము పాలుపంచుకొనుచుండగా, నిశ్చయత కిరీటాకృతిలో మన నమ్మకములను తగిన విధముగా అమరిక చేయు లక్ష్యమును సాధించునట్లు ఆత్మ మనలను నడిపిస్తాడు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# ముగింపు

మన క్రైస్తవ వేదాంతశాస్త్రమును నిర్మించుచుండగా దేవుని ప్రత్యక్షత మీద ఎలా ఆధారపడాలో ఈ పాఠములో మనము చూశాము. దేవుడు మనకు సాధారణ మరియు విశేష ప్రత్యక్షతను ఇచ్చాడని మనము చూశాము; కాబట్టి సృష్టి, మరియు లేఖనములో ఆయన ప్రత్యక్షత మీద మనము ఆధారపడాలి. ప్రత్యక్షతను అర్థం చేసుకొనుట పాపము యొక్క ప్రభావము ద్వారా నష్టపరచబడింది, కాని పరిశుద్ధాత్మ యొక్క వెలిగింపు ద్వారా బలపరచబడింది అని కూడా మనము గమనించాము. మరియు చివరిగా, బైబిలు వ్యాఖ్యానము, సమాజములో పాలుపంపులు మరియు క్రైస్తవ జీవనము యొక్క ప్రభావములకు వినయముతో సమర్పించుకొనుట, మనము కలిగియున్న ఒకొక్క వేదాంతశాస్త్ర స్థానమునకు ఏ స్థాయి నిశ్చయత తగినదైయున్నదో నిర్ధారించుటకు సహాయపడుతుంది.

ఈ అంశములు ఈ పాఠ్యాంశములకు ఎంతో ప్రాముఖ్యమైయున్నవి ఎందుకనగా ఈ అంశములను జ్ఞాపకముంచుకొనుట ద్వారా మాత్రమే దేవుని ప్రత్యక్షత మీద ఆధారపడియున్న వేదాంతశాస్త్రమును నిర్మించాలను మన లక్ష్యమును చేరుకోగలము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.